13CTR1:13CTR1.qxd 9/12/2026 11:07 PM Page 1



తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# నేనంటే ..నేనే...

## తిరుపతి నగర మేయర్ ఆశావహుల ప్రచార హోరు -కూటమిలో టికెట్ల గోల యువతపై చంద్రబాబు దృష్టి





ప్రభాతవార్త-తిరుపతి:

రాష్ట్రంలోనే కీలకమైన తిరుపతి నగర మేయర్ నేనంటే నేనే... అంటూ ఆశావహులు అప్పుడే కుర్చీని కూడా పంచేసుకుంటున్నారు! ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియదు.. మేయర్ స్థానం ఏ వర్గానికి కేటాయిస్తారో తెలియదు.. వార్డుల రిజర్వేషన్లు పూర్తికాలేదు.. ఓటర్లు ఎంతమందో తేలలేదు.. అయినా మేయర్ అభ్యర్థుల ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. మొత్తానికి ఆలు లేదు.. చూలు లేదు.. కొడుకు పేరు సోమలింగం" అన్న సామెతకు తిరుపతి రాజకీయాలు సరికొత్త అర్థం చెబుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కొందరు ఆశావహులు తమకు తామే మేయర్ అభ్యర్థులుగా ప్రకటించుకుంటున్నారు. కులాలు, వర్గాల పేరుతో ప్రచారాలు మొదలుపెట్టేశారు. మరికొందరు సర్వేలు చేయించుకుంటున్నారు. ఇంకొందరు యూట్యూబ్ చానళ్లలో మేయర్‌గా ఎవరైతే బాగుంటుంది?" అంటూ ప్రజాభిప్రాయ సేకరణకు దిగుతున్నారు. ప్రజలు ఓటు వేయాల్సిన ఎన్నికలు ఇంకా రాకముందే మేయర్ పదవికి మాత్రం ఓటింగ్ మొదలైపోయినట్టుంది.గతంలో తిరుపతి కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా ప్రస్తుతం అవి 66కు పెరిగాయి. కానీ కొత్త వార్డుల రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాలేదు. ఓటర్ల సంఖ్యపై కూడా స్పష్టత లేదు. మేయర్ పదవి ఏ వర్గానికి దక్కుతుందో కూడా తెలియదు. అయినా ఆశావహుల ఉత్సాహానికి మాత్రం ఇవేవీ అడ్డంకులు కావడం లేదు. తిరుపతి మేయర్ స్థానం జనసేనకు కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించి పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. శుక్రవారం జనసేన స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు అధ్యక్షతన తిరుపతిలో కార్పొరేషన్‌కు సంబంధించిన ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. ఆ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు క్రికెట్ విజయ్ కుమార్, కిరణ్ రాయల్, కీర్తన, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మేయర్ స్థానం జనసేనకు కేటాయిస్తే గెలిచి పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తామంటూ తీర్మానం కూడా చేశారు. దీంతో జనసేనలో మేయర్ కుర్చీ కోసం అప్పుడే కర్చీఫ్‌లు పడుతున్నాయి. బలిజ సామాజిక వర్గానికి చెందిన పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, కీర్తన, సుభాషిణి తదితరులు మేయర్ పదవిని ఆశిస్తున్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన విద్యా వేత్త వెంకటేశ్వర్లు కూడా గట్టిగానే ప్రయత్నం చేస్తున్నారు. అయితే టిడిపి నేతల వాదన మరోలా ఉంది. తిరుపతి ఎమ్మెల్యే స్థానాన్ని జనసేనకు ఇచ్చినందున మేయర్ పదవి టిడిపికి ఇవ్వాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నారు. ఈ పార్టీలోనూ మేయర్ టిక్కెట్ కోసం పోటీ తక్కువేమీ లేదు. యాదవ సామాజిక వర్గం నుండి అన్నా అనితా యాదవ్, పుష్పా వతియాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్ రేసులో ఉన్నారు. బిసి వర్గంలో మాజీ కార్పొరేటర్ నరసింహాచారి పేరు,చెంచులక్ష్మి పేర్లు వినిపిస్తున్నాయి. రెడ్డి సామాజిక వర్గానికి టిక్కెట్ ఇస్తే వైసిపి నేతలు భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్ రెడ్డిని ఎదుర్కోవచ్చన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో డాక్టర్ ఎన్ బి హర్షవర్ధన్ రెడ్డి, మబ్బు దేవనారాయణ రెడ్డి, సూరా సుధాకర్ రెడ్డి పేర్లు తెరపైకి వచ్చాయి. ఈసారి కమ్మ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని కొందరు పట్టుబడుతున్నారు. ఆ వర్గానికి చెందిన ఆర్సీ మునికృష్ణ, కంకణాల రజనీకాంత్ నాయుడు, కంద్ర లక్ష్మీ ॖమపతి నాయుడు, ఊట్ల సురేంద్ర నాయుడు కూడా మేయర్ పదవిని ఆశిస్తున్నారు. బలిజ సామాజిక వర్గం నుండి ప్రణీత్,డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బివి కీర్తి ఉన్నారు. బిజెపి నుండి సామంచి శ్రీనివాస్, జి.పృథ్వీరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మేయర్ కాకపోయినా కనీసం డిప్యూటీ మేయర్ పదవైనా తమకు ఇవ్వాలని కొందరు కోరుతున్నారు. ఇక మరికొందరు మేయర్ పదవి ఎస్సీలకే ఇవ్వాలి" అంటున్నారు. బ్రాహ్మణులకు కనీసం నాలుగు కార్పొరేటర్ సీట్లు కేటాయించాలని మరో వర్గం డిమాండ్ చేస్తోంది.

**మేయర్ కుర్చీ ఒక్కటే. దాని కోసం అభ్యర్థులు మాత్రం లెక్కకు మించి**

తిరుపతిపై సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టిడిపికి చెందిన ప్రజాదరణ ఉన్న యువ నేతను రంగంలోకి దించాలని భావిస్తున్నట్టు సమాచారం.

# తిరుపతి మేయర్ పదవిని ఎస్సీ రిజర్వేషన్ చెయ్యాలి

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో తిరుపతి మేయర్ స్థానాన్ని ఎస్సి రిజర్వేషన్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, పొలిటికల్ జేఏసీ జాతీయ కార్యదర్శి దుగ్గాని జయరామ్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధాన భూమిక పోషించిన వర్గం ఎస్సీ ఎస్టీ అని, తంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న ఇప్పటి వరకు కీలకమైన పదవుల్లో ఎస్సీ, ఎస్టిలకు తగిన ప్రాధాన్యత కల్పించలేదన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 168 బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన హరిజన వాడలు ఉన్నాయని, వారిని ఓటు హక్కు గానే వాడుకొని వారికి మొండి చెయ్యి చూపిస్తున్నారని వాపోయారు. అంబేద్కర్ ఆసియా సాధనకు బడుగు బలహీన వర్గాల సేవకుడు అయినటువంటి తాళ్లపాక దామని కూటమి అభ్యర్థిగా ప్రకటించాలన్నారు. దాముని ప్రకటించని పక్షంలో అన్ని కార్పోరేషన్ల డైరెక్టర్స్‌గా ఎస్సీ వర్గానికి చెందిన వారందరిని నిలబెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జై భీమ్ రాష్ట్ర అధ్యక్షులు పి రామచంద్ర, కె ఎస్ రఘు, ఏ సతీష్ కుమార్, పవన్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గోవిందుని బ్రహ్మోత్సవాలకు రేపు "అంకురార్పణ"



తిరుమల, సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి: వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సోమవారం రాత్రి "అంకురార్పణ" చేపట్టనున్నారు. మంగళవారం ధ్వజారోహణంతో మొదలవుతాయి. ఇందుకోసం అవసరమైన దర్భ,తాడును టిటిడి సిద్ధం చేసింది. వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం,బీజావాహనం అత్యంత ముఖ్యమైంది. గరుడకేతన ప్రతిష్ట, కంకణధారణ, ఆలయం ఆవరణలోనూ బయట చుట్టూ అష్టదిక్కుల్లోనూ బలినిచేస్తూ స్వామివారు శ్రీదేవిభూదేవి సమేతంగా ఆలయ పరివారదేవతలతో ఊరేగుతూ అష్టదిక్పాలురను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం నిర్వహిస్తారు.

# సత్యప్రమాణాలకు నెలవు : గణనాధుని కొలువు

## రేపటి నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రభాతవార్త : కాణిపాకం

సత్యప్రమాణాలకు నెలవుగా... కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం విరాజిల్లుతోంది. జిల్లా కేంద్రానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో బహుదానది తీరంలో వెలసిన ఈక్షేత్రం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. అనతికాలంలోనే ఎంతో అభివృద్ధి చెందిన ఈఆలయానికి వెయ్యేళ్ళ చరిత్రవుంది. ఈఆలయంలో సోమవారం నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. పూర్వం విహారిపురి అనే గ్రామంలో ధర్మాచరణ పరాయణులైన ముగ్గురు సోదరులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. పూర్వజన్మ కర్మఫలంగా పెద్దవాడు గుడ్డివాడుగా, రెండోవాడు మూగ, మూడోవాడు చెవిటివానిగా పుట్టారు. ముగ్గురు వికలాంగ సోదరులు తమ కర్మఫలాన్ని అనుభవిస్తూ... ఉన్నపొలాన్ని సాగుచేస్తూ జీవనం సాగించేవారు. ఈనేపథ్యంలో వర్షాలు లేకపోవడంతో గ్రామం కరువుతో తల్లడిల్లిపోయింది. గ్రామస్తులకు కనీసం త్రాగడానికి సైతం నీరు లేకుండా నానా అవస్థలకు గురయ్యారు. కరువును జయించడానికి ముగ్గురు సోదరులు తమ పొలంలోవున్న ఏతంబావిని లోతు చేయడానికి పూనుకున్నారు. బావిని తవ్వుతుండగా వీరికి ఓపెద్దరాయి అడ్డువచ్చింది. దీనిని తొలగించడానికి వీరు ప్రయత్నించారు. ఈప్రయత్నంలో చేతిలోని గడ్డపార సహాయంతో రాయిని తొలగిస్తుండగా గడ్డపార రాయికి తగిలి వెంటనే రాయి నుండి రక్తం చిమ్మింది. ఆరక్తం తాకడంతో సోదరుల అంగవైకల్యం తొలగిపోయింది. ఈవిషయాన్ని ముగ్గురు గ్రామాన్ని పాలిస్తున్న రాజుకు, గ్రామస్తులకు వివరించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు బావిని పూర్తిగా తవ్వి పరిశీలించారు. ఆబావిలో వినాయకుని రూపం కన్పించడంతో గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించారు. భక్తులు సమర్పించిన కొబ్బరికాయల సమర్పణతో ఆ నీరు 'కాణి' భూమి పారింది. (కాణి అంటే ఎకరం పొలం అని అర్థం) కాణి మేర పొలం పారినందున ఈగ్రామానికి 'కాణిపారకమ్' అనే పేరు వచ్చింది. కాలక్రమంలో ఈగ్రామం కాణిపాకంగా మారింది.

**ప్రమాణాల దేవుడుగా ప్రసిద్ధి...**

కాణిపాకం వినాయకుడు ప్రమాణాల దేవుడిగా ప్రసిద్ధి చెందారు. సాధారణంగా వివాదాల పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు గాని, న్యాయ స్థానాలకుగాని, మధ్యవర్తుల వద్దకు వెళ్ళి పరిష్కరి ంచుకుంటారు. అయితే కాణిపాకంలో స్వామివారే న్యాయనిర్ణేత. స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణం చేస్తే స్వామివారే శిక్షిస్తాడని ఇక్కడి భక్తుల నమ్మకం. త్రాగుడు, దురలవాట్లకు బానిసలైనవారు స్వామివారి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని ప్రతీతి. స్వామివారి ఎదుట సాధారణ ప్రమాణాలే కాకుండా రాజకీయ ప్రమాణాలు సైతం చేయడం విశేషం. గతంలో ఇక్కడ ప్రమాణాలను సైతం కోర్టులు కూడా ఏకీభవించేవని ఆధారాలున్నాయి.

**దినదిన ప్రవుద్ధుడు వినాయకుడు...**

కాణిపాకం వినాయకుడు నిత ్యప్రవృద్ధుడుగా అలరారుతున్నారు. స్వామివారు నిత్యం పెరుగుతున్నాడనడానికి ప్రత్యక్ష నిదర్శనం వుంది. 1947లో భక్తులు తయారుచేయించి ఇచ్చిన వెండి కవచం ప్రస్తుతం సరిపోవడంలేదు. అలాగే 2000 సంవత్సరంలో తయారుచేసిన మరో వెండికవచం, 2005లో టీటీడీ మాజీ చైర్మన్ దివంగత డి.కె.ఆదికేశవులు తయారు చేయించిన కవచం కూడా ప్రస్తుతం స్వామివారికి సరిపోవడంలేదు. ప్రస్తుతం ఈమూడు కవచాలను భక్తుల సందర్శనార్థం ప్రాకార మండపంలో వుంచారు. శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలుగా మరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయం, శ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలు వున్నాయి.

# భానుడి భగభగలు.. మండుతున్న ఎండలు

## - వేరుసెనగ సాగు ఆశలు ఆవిరే .. పలు గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా !! - తీవ్ర ప్రభావం చూపుతున్న ఎల్‌నినో !!

కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

గతంలో ఎన్నడూలేని విధంగా ఎల్‌నినో వాతావరణంలో తీవ్ర ప్రభావం చూపుతోంది. సెప్టెంబర్ మాసం సమ్మర్ (వేసవి)ని తలపిస్తోంది. ఇప్పటికే ఖరీఫ్ సీజను ముగింపు దశకు చేరింది. ఏటా ఖరీఫ్ సీజనులో కురిసే వర్షాలు కూడా ఈ ఏడాది కురవలేదు. దీంతో అతి తక్కువ వర్షపాతం మాత్రమే నమోదైంది. ప్రతి సంవత ్సరం కురవాల్సిన సాధారణ వర్షాలు సైతం ఎల్‌నినో ఎఫెక్ట్‌తో కురవలేదు.వాతావరణంలో సంభవించిన మార్పుల దృష్ట్యా సెప్టెంబర్ మాసం మొదలై ఏడు రోజులు గడిచినా భానుడి భగభగలు మాత్రం తగ్గడం లేదు. మండు వేసవిని తలపించే రీతిలో ఎండలు మండిపోతున్నాయి. కర్ణాటక రాజధాని బెంగళూరు నగరం లాంటి వాతావరణాన్ని పోలిన కుప్పం ప్రాంతంలో సైతం ఎల్‌నినో



ప్రభావంతో ఎండలు ఏ మాత్రం తగ్గడం లేదనే చెప్పాలి. రోజూ 36 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో భూగర భజలాలు అడుగ ంటడంతో ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు నలభై గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. చాలావరకు చెరువులు, కుంటల్లో నీరు ఇంకాయి. ఖరీఫ్ సీజనులో రైతులు వర్షాధార పంట అయిన వేరుసెనగ సాగు చేస్తారు. ఈఏడాది వేరుసెనగ సాగు చేసిన రైతులు దాదాపు పంటపై ఆశలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సకాలంలో వానలు కురవకపోవడంతో పలుచోట్ల మొలకదశలోనే రైతులు పంట నష్టపోయినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వాతావరణ శాఖ నిపుణులు మాత్రం సెప్టెంబర్ 14-16 తేదీల్లో బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనంతో వర్షాలు ఉంటాయని చెబుతున్నారు. అప్పుడైనా వర్షాలు కురిసి వాతావరణం చల్లబడుతుందేమో చూడాలి.

# చిత్తూరు జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వవిప్ కంచర్ల



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చితూ ్తరు జిల్లాకు తెలుగుదేశం పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ను తెదేపా అధిష్టానం నియమించింది. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయంకు ప్రణాళికల రూపకల్పనతో పాటు పార్టీ తరపున ఎన్నికల బాధ్యతలను డాక్టర్ కంచర్ల నిర్వహిస్తారు. పార్టీ నేతల మధ్య సమన్వయం, సంస్థాగతంగా పార్టీబలోపేతం, నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలో సమావేశాలు, అభ్యర్థుల గెలుపుకు అవసరమైన వ్యూహాల రూపకల్పన వంటి కీలక బాధ్యతలు ప్రభుత్వ ్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ నిర్వహించనున్నారు. ఈసందర్భంగా డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని వందశాతం నిలబెట్టుకుంటూ శక్తివంచన లేకుండా పార్టీ కోసం పనిచేస్తానన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా పనిచేసి చిత్తూరు జిల్లాలో కూటమి సత్తా చాటుతామన్నారు. ఎన్నికల్లో ఘనవిజయమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# చవితి వేడుకల్లో నిబంధనలు పాటిద్దాం

**..ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ ఎం. జయకృష్ణ**

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:



వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు పాటించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ పిలుపునిచ్చారు. నిమజ్జనం రోజు విగ్రహాల ఊరేగింపు రూట్ మ్యాప్‌ను శనివారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఎస్పి సుబ్బరాయుడు, కమిషనర్ ఎం.జయకృష్ణ, విద్యుత్ ఎస్.ఈ.చంద్రశేఖర్, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు కలసి ఆవిష్కరించారు. చవితి వేడుకల్లో నియామాలను ఉల్లగించకుండా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిద్దామని మండపాల నిర్వాహకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరవాసులు అందరూ మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తెలిపారు. నగరంలో మండప నిర్వాహ కులు అందరూ సమన్వయం పాటించి భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని తెలిపారు. తాము రూపొందించిన రూట్ మ్యాప్ ప్రకారం నిమజ్జనం కొరకు వినాయక సాగర్ కి విగ్రహాలు తీసుకు రావాలని తెలిపారు. మండప నిర్వాహకులు అందరూ నిమజ్జనం తేదీలను ముందుగానే తెలపాలని, ఆరోజే నిమజ్జనానికి రావాలని తెలిపారు. మద్యం సేవించడం వంటివి పూర్తిగా నిషేధం అని తెలిపారు. నిమజ్జనానికి మూడవ రోజు, ఏడరోజున సాగర్ లోను, ఆయా మార్గాల్లో అన్ని ఏర్పాట్లను చేపడుతున్నామని, భక్తులు, మండప నిర్వాహకులు చవితి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్పీ రవి మనోహర్ ఆచారి, డి ఎస్పీలు భక్తవత్సలం, కొండయ్య, నిమజ్జన కమిటీ సభ్యులు ఆర్సి మునికృష్ణ, గుండాల గోపి, నవీన్ కుమార్ రెడ్డి, వరప్రసాద్, మండపాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీకి తగ్గనున్న కళ

## - 65 నుండి 27 మండలాలకు అధికారం కుదింపు
## - 14 నుండి 6 మంది ఎమ్మెల్యేలకు పరిమితం



చిత్తూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్‌గా ఇప్పటి వరకు 65 మండలాలతో కళకళలాడిన చిత్తూరు జిల్లా పరిషత్ ప్రస్తుత జడ్పీ పాలకవర్గం గడువు పూర్తి కానుండటంతో కళ తగ్గనుంది. రాష్ట్రంలో గతంలో అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలను పునర్విభజించడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా మూడు జిల్లాలుగా విభజనకు గురైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 27 మండలాలతో చిత్తూరు జిల్లాను ఏర్పాటు చేయగా మిగిలిన మండలాలను కొత్తగా ఏర్పాటు చేసిన బాలాజీ, మదనపల్లి జిల్లాల్లో విలీనం చేసి కొత్తగా మరో రెండు జిల్లాలను ఏర్పాటు చేశారు. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలతో పాటు చిత్తూరు, తిరుపతి, రాజంపేట పార్లమెంటు సభ్యులు ప్రాతినిధ్యం వహించేవారు. ప్రస్తుత జడ్పీ పాలకవర్గం గడువు ఈ నెల 24నాటికి ముగియనుండటంతో ఇప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్‌కు ప్రాతినిధ్యం వహించిన కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు చిత్తూరు జిల్లా పరిషత్ నుండి విడిపోయి నూతనంగా ఆవిర్భవించనున్న జిల్లా పరిషత్‌లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 23వ తేదీ మండల పరిషత్ పాలకవర్గాలకు, 24వ తేదీ జిల్లా పరిషత్ పాలకవర్గాలకు గడువు ముగియనుంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాలకు గడువు ముగియనుండటంతో మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్‌కు ప్రస్తుతం 65 మంది జడ్పిటీసీలు, 65 మంది ఎంపిపిలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వున్న 65 మండల పరిషత్‌లలో 878 మంది ఎంపిటీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లాలను పునర్విభజించడంతో ఇది వరకు 65 మండలాలతో ఉమ్మడి చిత్తూరు జిల్లాగా వర్థిల్లి 65 జడ్పీటీసీలు, 65 ఎంపిపిలతో వర్థిల్లిన ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ సెప్టెంబర్ 24 అనంతరం 27 మండలాలతో కుదించబడనుంది. జిల్లాలు పునర్విభజించినప్పటికీ ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్, జడ్పీ సిఇఓలు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అధికారులు కలిగి వున్నారు. అయితే సెప్టెంబర్ 24 అనంతరం వీరు విభజిత చిత్తూరు జిల్లాలోని 27 మండలాల్లో మాత్రమే అధికారాలు చెలాయించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. చిత్తూరు జిల్లా పరిషత్ సెప్టెంబర్ 24 అనంతరం 27 మంది జడ్పీటీసీలకు పరిమితం కానుంది. అలాగే ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం 65 మండలాల పరిధిలో 878 మంది ఎంపిటీసీలు వుండగా ప్రస్తుతం వున్న చిత్తూరు జిల్లాలో 27 మండలాల పరిధిలో కేవలం 370 మంది ఎంపిటీసీలకు మాత్రమే మండల పరిషత్‌లు పరిమితం కానున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 65 మండలాలు వుండగా ప్రస్తుతం వున్న చిత్తూరు జిల్లాలో చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో చిత్తూరు, యాదమరి, జిడినెల్లూరు, గుడిపాల, పూతలపట్టు, పెనుమూరు, తవణంపల్లి, ఐరాల, పులిచెర్ల, రొంపిచెర్ల, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, బంగారుపాళ్యం మండలాలు, అలాగే నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో పాలసముద్రం, కార్వేటినగరం, నగరి, నింద్ర, విజయపురం మండలాలు, పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలు, కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలో కుప్పం, శాంతిపురం, గుడుపల్లి, రామకుప్పం మండలాలు వున్నాయి.

# మద్యం దుకాణాల ఏ4 లైసెన్సుల పునరుద్ధరణ

## .. 202627కి నోటిఫికేషన్ జారీ

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లాలో 202627 ఎక్సైజ్ సంవత్సరానికి ప్రస్తుతం అమలులో ఉన్న ఏ4 మద్యం దుకాణాల లైసెన్సుల పునరుద్ధరణకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, లైసెన్సింగ్ అథారిటీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కమిషనర్ విజయశేఖర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరితో కలిసి కలెక్టరేట్లో జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ శేఖర్, నాగమల్లేశ్వర్ రెడ్డి, వాసు దేవ చౌదరి మాట్లాడుతూ రూల్19ఏ ప్రకారం చేపడుతున్న ఈ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 21 సాయంత్రం 5 గంటల్లోపు ప్రస్తుత లైసెన్సుదారులు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 223 ఓపెన్ కేటగిరీ, గీత కులాలకు రిజర్వు చేసిన 22 దుకాణాలు కలిపి మొత్తం 245 ఏ4 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. పునరుద్ధరించిన లైసెన్సులు 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 22న ఫారం ఏ4(ఆర్)లో పునరుద్ధరణ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 202526లో అమలైన వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్ను (ఆర్ఈటి) రేట్లే 202627లోనూ కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

13 CTR 2:13 CTR 2.qxd 9/12/2026 11:06 PM Page 1



# గంటావూరుకు మహర్దశ

## రూ.5.50 కోట్లతో అభివృద్ధి పనులు
## ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:
పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరుకు మహర్దశ ప్రాప్తించిందని రూ.5.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు, మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయనతో పాటు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు గంటావూరు, బిసి కాలనీ, వినాయకనగర్‌లో పర్యటించారు. గంటావూరు ప్రధాన వీధిలో కొత్తగా వేస్తున్న సిమెంట్ రోడ్డును పరిశీలించారు. వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిమెంటురోడ్లు, మురుగునీటి కాలువలు, పైప్‌లైన్ల ఏర్పాటు, విద్యుత్ స్థంభాలు, కొత్తగా తాగునీటి బోర్లు ఇతర మౌళిక సదుపాయాలకు ఈ మొత్తం ఖర్చు చేస్తామన్నారు. 2016లోనే తాను ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా వున్న సమయంలోనే గంటావూరులో రూ.2.50 కోట్లు నిధులుతో అభివృద్ధి పనులు చేపట్టానని ఐతే అనంతరం వచ్చిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో పనులు అలాగే ఆగిపోయాయయని తెలిపారు. ప్రస్తుతం మరో రూ.5.50 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని వచ్చే 6 నెలలకు పనులు పూర్తి చేసి మళ్ళీ ఇక్కడే సమావేశంలో ఏర్పాటు చేసి ఇచ్చిన హామీలు గురించి తెలియజేస్తానన్నారు. ఎన్నికలు ఎప్పుడూ వస్తుంటాయని గెలుపు ఓటములు సహజమని ఐతే గుర్తుంచుకునే పనులు చేపట్టి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాలన్నారు. ఎమ్మెల్యేగా చేపడుతున్న అభివృద్ధి పనులు గుర్తించి వచ్చే అన్ని ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మున్సిపల్ కమీషనర్ లోకేష్ వర్మ,నాయకులుఆర్‌వి బాలాజీ. గిరిబాబు, నాగరాజు, ఖాజా, ఆర్‌బిసి కుట్టి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ట్రాక్టర్‌ను ఢీకొన్నలారీ

### ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



పలమనేరు, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:
పలమనేరు సమీపంలోని జగమర్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిలో శని వారం ఉదయం ఓ ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ చంద్ర (45) తీవ్రంగా గాయపడ్డాడు. పల మనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరుకు చెందిన చంద్ర ట్రాక్టర్‌లో కట్టెల లోడ్‌తో గంటావూరు వైపు వెళుతుండగా తమిళనాడు రాష్ట్రం వేలూరు నుండి పలమనేరుకు వస్తున్న లారీ ట్రాక్టర్‌ను వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ట్రాక్టర్ డ్రైవర్‌ను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సత్వరం ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు

– రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ డిమాండ్



చిత్తూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:
ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో దశాబ్దాలుగా తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్న ఉమ్మడి సర్వీస్ రూల్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం సత్వరం తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ డిమాండ్ చేశారు. జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు హెల్త్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్య చికిత్సలు సమగ్రంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డప్పనాయుడు, మణిగండన్‌లు మాట్లాడుతూ గత జనవరిలో ఇచ్చిన డిఎ బకాయిల్లో ఇంకను జమ కాని బకాయిలను, అలాగే సాంకేతిక కారణాలతో రిజెక్ట్ అయిన బిల్లులను మళ్లీ సబ్మిట్ చేయడానికి అవకాశం కల్పించాలన్నారు. అలాగే ఇన్‌సర్వీస్ టీచర్ల స్పెషల్ టెట్ ద్వారా ప్రత్యేక రాయితీ కోసం ఎన్‌సిటిఇ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధ్యం చేయాలని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డిప్లమ్మెంట్ ద్వారా నియామకం కాబడిన టీచర్లకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావవేశంలో జిల్లా సహాధ్యక్షులు రెహెనాబేగం, ఏకాంబరంలు, నాయకులు బి.ఈశ్వర, మహేంద్ర, పంటపల్లి సురేష్, పార్థసారధి, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి..సంక్షేమాలు ప్రజలకు చెప్పండి

– టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలపాల్సిన బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఉందని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం చ ందం పంచాయతీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, కృష్ణాజలాలు, కుప్పానికి పరిశ్రమల రాక, యువతకు ఉపాధి వంటి అంశాలు ప్రజలకు వివరంగా తెలియజేయాలన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల్లో కలుగుతున్న లబ్ధిని వివరించాలన్నారు. పార్టీలో నేతలు సమన్వయంతో పనిచేయాలని గ్రామస్థాయిలో మరింతగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లోను ఘనవిజయం సాధించేలా పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్ శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, ఎఎంసి డైరెక్టర్ తులసి, మాజీ సర్పంచ్ తోట షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## రూ.8.60లక్షల సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చిత్తూరురూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:
సిఎం సహాయనిధి చెక్కులను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఎమ్మెల్యే స్వగృహంలో 5 మందికి రూ.8.60లక్షల విలువైన చెక్కులనుఅందజేసారు. పేద, మధ్య తరగతి ప్రజల వైద్యఖర్చులకు సిఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రాజ్, అముద, పచ్చయప్ప, మేషక్ తదితరులు పాల్గొన్నారు.

## పైమాఘంలో మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం



తవణంపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:
మండలంలోని అరగొండ గ్రామ పంచాయతీ పైమాఘం గ్రామంలో అర్ధగిరి ఆలయ మాజీ ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్‌రెడ్డి తన సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభోత్సవం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ మంది కలుషితమైన తాగునీరు సేవించడం వల్ల పలు అంటురోగాలకు గురవతున్నట్లు గుర్తించి పైమాఘం సుగుణాకర్‌రెడ్డి పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు.యాదమరి, బంగారుపాళ్యం, చిత్తూరు రూరల్ మండలాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధి చేసిన తాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో తన సొంత నిధులలో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు నియోజకవర్గంలో సుమారు కోటి రూపాయలతో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటివరకు 17 గ్రామాలలో సుమారు 80 లక్షల రూపాయలతో ప్లాంట్లను ఏర్పాటు చేయగా అరగొండ గ్రామపంచాయతీలోని పైమాఘంలో సుమారు 6.50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన.శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పైమాఘం సుగుణాకర్‌రెడ్డి సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు జి.కరీం, మాజీ సర్పంచ్ మల్లుదొరై, తేంబల్లి పూర్ణం, ప్రశాంత్‌కుమార్, తంగరాజు, హరిలతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు సహకారం

– వైకాపా నేతలతో ఎస్ఐ శ్రీకాంత్



పెనుమూరు, పెప్టెంబర్ 12 ప్రభాతవార్త:
మండల పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షణకు పార్టీలకు అతీతంగా నాయకులు పోలీసులకు సహకారం అందించాలని ఎస్ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. పెనుమూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ను మండల వైకాపా నాయకులు శనివారం పోలీస్ స్టేషన్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులతో ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయని, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలక్షన్ కమీషన్ నిబంధనల మేరకు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో తాము ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుండి న్యాయబద్దంగా విధులు నిర్వహిస్తామన్నారు. ప్రజలు వర్గ వైషమ్యాలు విడనాడి చట్టానికి లోబడి నడచుకోవాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రలత పరిరక్షణలో తమ సహకారం వుంటుందని వైకాపా నాయకులు ఎస్ఐ శ్రీకాంత్‌కు తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్‌ను కలిసి సన్మానించిన వైకాపా నాయకుల్లో గిరిధర్‌రెడ్డి, కామసాని లోకేష్‌రెడ్డి, బండి కరుణాకర్‌రెడ్డి, పెనుమూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ జ్యోతినాధ్, వినోద్‌రెడ్డి, ఇరకమరెడ్డి, గిరి, దేవేందర్‌రెడ్డి తదితరులు వున్నారు

## ఊరూవాడా వినాయక మండపాలు సిద్ధం

– విక్రయాలకు కొలువు తీరిన గణపయ్యలు !!

కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
విఘ్నాలు తొలగించి తొలిపూజలందుకునే వినాయ కస్వామి చవితి పండగకు ఊరూవాడా సిద్ధమయ్యాయి. కుప్పం పట్టణంతో పాటు నియోజ కవర్గం లోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో వినాయక విగ్రహాల ప్రతిష్టకు సంబంధించి పెద్ద ఎత్తున నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. పండగ ఈనెల14వతేది సోమవారం కానుండడంతో ఆరోజు మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. కుప ్పం పట్ట ణంలో వినాయక చవితి సందర్భంగా వివిధ రూపాల్లో ఉన్న వినాయక ప్రతిమలు విక్రయాలకు కొలువు తీరాయి. ఇప్పటికే చాలాచోట్ల గ్రామాల్లో యువత విగ్రహాలను కొనుగోలు చేసి గ్రామాలకు తరలించారు.

## వినాయకుడి ఆకారంలో అలరించిన విద్యార్థులు



రామకుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
మండలంలోని రాజుపేట గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ముందస ్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు స్కూలు ఆవరణలో వినాయకుడి ప్రతిమ ఆకారంలో కూర్చుని ప్రదర్శన చేశారు. అనంతరం వినాయకుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తమిళనాడు క్రిష్ణగిరికి చెందిన జయగణేష్ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొతా ్తన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఇన్స్‌పెక్టర్ రవికి అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ,అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

రామకుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెలుగుయువత అధ్యక్షుడు బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని సింగసముద్రం గ్రామంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు పనులు ప్రారం భించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సిఎం నిధులు కేటాయిస్తున్నారన్నారు.్థనిక నేతలు పాల్గొన్నారు.

## పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : సిఐ



రామకుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
వినాయక చవితి పండగను గ్రామా ల్లో ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని రూరల్ సిఐ మల్లేష్ యా దవ్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పండగ నిర్వహణపై వివిధ కులసంఘాలతో సమావేశం జరిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం తలెత్తకుండా సహకరిం చాలన్నారు. మూడు రోజులకు విగ్రహాలను నిమజ్జనం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై మారెప్ప, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సీతాపతి, పత్ర నారాయణ, గుర్రప్ప, కామరాజునాయక్, విశ్వనాథ్, అబ్దుల్ సాబ్, సలాంసాబ్, ఎహసాన్ పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ పిఆర్ఒగా డాక్టర్ నరేష్



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
ద్రవిడ వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి (పిఆర్ఒ)గాగ్రంథాలయ శాఖలో పనిచేస్తున్న డాక్టర్ నరేష్ నియమితులయ్యారు. ఈమేరకు రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ డాక్టర్ నరేష్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వర్సిటీ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు విస్తృతంగా తెలిసేలా పనిచేయడంతో పాటు వర్సిటీ ప్రతిష్ట మరింత పెరిగేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## తుమ్మకొండలో సైబర్ నేరాలపై అవగాహన



చిట్వేలి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:
చిట్వేలి పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మకొండ గ్రామంలో పోలీసులు శనివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై వినోద్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. గంజాయి వినియోగం, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రహదారి భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్సై వినోద్ కుమార్ ప్రజలను కోరారు.

## కారు ఢీకొని వృద్ధురాలికి గాయాలు



బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
మండలంలోని మరవంక గ్రామ సమీపంలో రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని కారు ఢీకొనడంతో ఆమె గాయపడింది. ధర్మపురి గ్రామంకు చెందిన మునెమ్మ (67) పిండి మిషన్‌కు వెళ్లి రోడ్డుదా టుతుండగా బెంగళూరు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఆమెను ఢీకొంది.దీంతో తలకు గాయమైంది. 108లో ఆమెను చికిత్స నిమిత్తం బైరెడ్డిపల్లికి తరలించగా అక్కడనుంచి పలమనేరు ఆస్పత్రికి రెఫర్ చేశారు.

## ఎఎంసిఛైర్మన్ జిఎం రాజుచే అన్నదానం



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
స్థానిక చంద్రన్న వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పెద్ద ఎత్తున అన ్నదాన కార్యక్రమం చేపట్టారు. తన జన్మదినం సందర్భంగా యార్డులో రైతులు, కూలీలు, వ్యాపారులకు అన్నదానం చేశారు. అంతకుముందు స్థానిక నాయకుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి పంచారు. రైతులు, కూలీల మధ్య జన్మదినం జరుపుకోవడం ఆనందంగా ఉ ందన్నారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి వైస్‌ఛైర్మన్ శరవణ, డైరెక్టర్లు హరినాథరెడ్డి, ఇర్ఫాన్, పవన్‌కుమార్, తులసి, వడివేలు,భాను, ఉదయ్, ఎఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



ఓబులవారిపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
కడప చెన్నై ప్రధాన రహదారి ఓబులవారిపల్లి మండలం మొక్కవారిపల్లికి వెళ్లే రహదారి కలవర్టు వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడుతుందనే ఉద్దేశంతో తాడిపత్రి గ్రామానికి చెందిన బి.మురళి(40) రోడు పైకికి దూకడంతో లారీ వంకలో పడకుండా తిరిగి రోడ్డుపైకి ప్రయాణించడంతో కిందపడిన డ్రైవర్‌పై ముందు చక్రాలు ఎక్కడంతో మృతుడు డ్రైవర్ అక్కడ కక్కడే మృతి చెందాడని ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ తెలిపారు సేవ పరీక్ష కోసం శవాన్ని రైల్వే కోడూరు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

## బిల్లుల సమర్పణకు అవకాశం

– రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:
ఉద్యోగ, ఉపాధ్యాయుల కరవు భత్యం బిల్లుల సమర్పణకు ట్రెజరీ అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ప్రకటించిన డిఎ బిల్లుల చెల్లింపు జరపాలంటే గతంలో పెండింగ్‌లో వున్న 3 విడతల బకాయిలు జనవరి 2025 నాటికి జిఓ నెం.62 ప్రకారం అరియర్ బిల్లులను మొదట చెల్లిస్తేనే సాధ్యమవుతుందన్నారు. ట్రెజరీ అధికారులు నిధి పోర్టల్‌లో అప్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. పాత డిఎల అరియర్స్ చెల్లింపుకు అవకాశం కల్పించకపోతే ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆయన మండి పడ్డారు. ప్రభుత్వం సత్వరం స్పందించి ట్రజరీ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో డ్రాయింగ్ అధికారులు అరియర్ బిల్లుల ప్రాసెసింగ్ జరిగేలా తక్షణం చర్యలు

## నూతన తాగునీటి పైపులైను ఏర్పాటు



కుప్ప ం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
స్థానిక మున్సిపల్ పరిధి 20వ వార్డులో కౌన్సిలర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సోమశేఖర్ అధ్వర ్యంలో నూతన తాగునీటి పైపులైనును ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేశారు. గతంలో ఏరా ్పటుచేసిన పైపులైను పగిలి పోవడంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యగా నూతన పైపులైను ఏర్పాటుచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# లోక్ అదాలత్‌లు సద్వినియోగం

– జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక



చిత్తూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:
జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా న్యాయపరమైన సమస్యలను త్వరితగతిన, ఎలాంటి ఖర్చు లేకుండా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కారం లభించే అవకాశంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అన్నారు. జిల్లా కోర్టు హాలులోని మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి హాల్ నందు శనివారం జాతీయ న్యాయ సేవాసంస్థ, రాష్ట్ర న్యాయ సేవాసంస్థల పర్యవేక్షణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. మొదటి అదనపు సివిల్ జడ్జి కోర్టు హాలులో 1వ బెంచ్ నందు మోటార్ వాహనాల ప్రమాద పరిహార కేసులు, ఇరు వర్గాలకు సంబంధించిన విషయాలపై మొదటి అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసులు విచారించారు. అనంతరం ఆర్థిక భరోసాకు సంబంధించిన ధృవపత్రాలను జిల్లా ప్రధాన జడ్జి అరుణ సారిక చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ధనం రెండు ఆదా అవుతాయన్నారు. లోక్ అదాలత్‌లో వెలువడే తీర్పులు తుది నిర్ణయాలుగా వుంటాయని, వాటిపై తదుపరి అప్పీల్‌కు అవకాశం వుండదన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం వున్న క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, మోటార్ వాహన ప్రమాద పరిహారం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఈపి కేసులు, డివిసి కేసులు, ఎంసీ కేసులు, బ్యాంకుల రుణ బకాయిలకు సంబంధించిన కేసులు, పిఎల్‌పికి సంబంధించిన కేసులు తదితర కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చిత్తూరుతో పాటు 13 మండలాల్లోని అన్ని కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు, మోటార్ వాహనాల కేసులు తదితర కేసులు రాజీ చేయబడునన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కోసం 30 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కేసుల పరిష్కారంలో చిత్తూరు జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం 4 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, వివిధ కేసులకు సంబంధించిన ఇరఉ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపాలిటీలో ఘనవిజయం సాధించాలి

– కడ సభ్యుడు రాజ్‌కుమార్



కుప్పం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కుప్పం మున్సిపాలిటీలో ఘన విజయం సాధించాలని కడ సభ్యుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక శాంతి లేఔట్‌లో 24వ వార్డు సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంకు చొరవ చూపాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలతో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రోహిత్, నేతలు డాక్టర్ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, మాణిక్యం, మురుగేష్,ప్రతాప్ సింహా, తిమ్మరాయప్ప, కౌన్సిలర్ గణపతి, క్రాంతికుమార్, చిన్నప్పయ్య పాల్గొన్నారు.

# కల్పిత నాయకుడు అంబేద్కర్ అనే పుస్తకాన్ని రద్దు చేయాలి

### అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసనలు తెలుపుతున్న దళిత నాయకులు....



**ఓబులవారిపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన ఓబులవారిపల్లి చిన్న వరంపాడు క్రాస్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో శనివారం సాయంత్రం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ వాది సీనియర్ పాత్రికేయులు డాక్టర్ బి.ఆర్ రమణ మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రత్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై ఓ ప్రబుద్ధుడు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అంబేద్కర్ కల్పిత నాయకుడనే పుస్తకాన్ని రచించి కొద్ది రోజుల్లో ఆవిష్కరించడంతో ఆ పుస్తకాన్ని ఆవిష్కరించరాదని రద్దు చేయాలని ప్రభుత్వం ఆ ప్రబుద్ధుడు పైన కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో ఖండించారు. నేటికీ స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు పూర్తికావస్తున్న ఇప్పటికీ ఎటువంటి మేధావులు ఎటువంటి అగ్రవర్ణాల వారు డాక్టర్ అంబేద్కర్ ను విమర్శించలేదని, పుట్టగొడుగుల పుట్టకొచ్చి ఓ నిజాన్ని పదే పదే అబద్ధముగా మార్చడంతో భావితరాల ప్రజలకు ఈ నిజం అబద్ధం ఏమోనని అపోహలు నిలిచిపోతాయని ఉద్దేశంతో ఇలాంటి వారిని ఆదిలోనే ఇలాంటి వ్యాఖ్యలు అంతం చేయాలని కోరుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ వాదులు రోడ్డుపై కొచ్చి రాస్తారోకోలు ధర్నాలు చేసి కల్పిత నాయకుడు పుస్తకం రాసిన అమర ప్రసాద్ పై చర్యలు తీసుకోవడం తప్పదని అంబేద్కర్ వాదులు పోలమనేని మల్లికార్జున పాణ్యం చిన్నయ్య గొంజిపల్లి హరి దేగల మహేశ్వర నారాయణ పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేకాకుండా ఒక నాయకుడిని కొందరు వ్యక్తులు ఉద్దేశి పూర్వకంగా. మాట్లాడితే వారిని అరెస్టు చేసి కేసులు పెడుతున్నారు కానీ ప్రపంచ మేధావి దేశానికి ఎన్నో సేవలు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే అటు దళిత నాయకులు కానీ దళిత ఎమ్మెల్యేలు మంత్రులు రాష్ట్రంలో ఉన్న మేధావులు నాయకులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని కనీసం నోరు కూడా మెదపలేదని విమర్శించారు.పలువురు దళిత నాయకులు గాజుల శ్రీనివాసులు పోలంనేని చంద్రయ్య అంబారి శ్రీనివాసులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## ఆకాశానంటిన నిత్యవసర సరుకులు



**రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు మండలంలో వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకొని నిత్యవసర సరుకులు భారీగా పెరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నిత్యవసర సరుకులు ధరలను ఎవరు అదుపు చేయలేక భారీగా పెరగడంతో నిరుపేదలు దారిద్రరేఖకు దిగునున్నవారు ఏమి కొనాలో ఏమి తినాలో అన్న చందంగా ఆలోచనలో పడ్డారు. ముఖ్యంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మబ్బులు వచ్చిన వర్షం వస్తాయని ఆశల్లో ఉన్న రైతులు కేవలం మబ్బులతోనే సరిపెట్టుకపోవడంతో పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన రైతులు పూర్తిస్థాయిలో వినాయక చవితిని చేసుకోలేని పరిస్థితిలో కూడా మెండుగా ఉన్నాయి. దీనిపై నిత్యవసర సరుకులు అంగళ్ళ వద్దకు వెళ్తే ఎందుకు ఇంత ధరలు పెరిగాయని అడగగా గల్ఫ్ దేశాలలో యుద్ధాలు జరుగుతున్న నేపథ్యంలో పూర్తిగా ధరలు పెరిగాయని ఇవి మా చేతుల్లో లేవని కూడా షాపు యజమానులు తెలియజేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా గణపతి దేవుడికి పెట్టే పూజా సామాగ్రిని కూడా పూర్తిగా ఆకాశానికి అంటాయని, కొనలేని పరిస్థితులు మెండుగా ఉన్నాయని బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి నిత్యవసర సరుకుల యజమానులపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## నేషనల్ లోక్ అదాలత్‌లో రూ.కోటి పరిహారం




**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :**

తిరుపతి జిల్లా, నాగలాపురం, వినోబా నగర్ కు చెందిన దిల్లీబాబు 2025 మే నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మరణానంతరం, న్యాయవారసులు భార్య లావణ్య ,ముగ్గురు కుమార్తెలు తల్లి మద్రాస్ హైకోర్టు న్యాయవాది చెరుకూరి హేమంత రావును సంప్రదించి, ప్రమాదానికి కారణమైన వాహన యజమాని ,బీమా సంస్థపై 2025 నవంబర్ 12న చెన్నై హైకోర్టు ఆవరణలోని మోటార్ వాహన ప్రమాదాల పరిహార ట్రిబ్యునల్ ముఖ్య న్యాయమూర్తి ముందు పరిహారం క్లెయిమ్ పిటిషన్ దాఖలు చేశారు.బీమా సంస్థ లిబర్టీ ఇన్సూరెన్స్ , క్లెయిమెంట్ల న్యాయవాది చెరుకూరి హేమంత రావు మధ్య చర్చల అనంతరం, ఈ కేసు దాఖలు చేసిన 10 నెలల్లోనే నేషనల్ లోక్ అదాలత్లో రూ.1 కోటికి సామరస్యంగా పరిష్కారమై, మృతుని కుటుంబానికి సకాలంలో ఉపశమనం లభించింది. గౌరవ న్యాయమూర్తి ఎస్.ఎం. సుబ్రమణ్యం, మద్రాస్ హైకోర్టు, చెన్నై క్లెయిమెంట్లకు అందజేశారు. 2017లో జరిగిన ఏర్పేడు రోడ్డు ప్రమాదంలో ఒక లారీ ప్రజలను ఢీకొనడంతో 16 మంది మృతి చెందగా, 16 మంది గాయపడ్డారు. ఈ సంఘటనలో బాధిత కుటుంబ సభ్యులకు న్యాయవాది చెరుకూరి హేమంత రావు చేసిన మేలుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అడ్వాన్స్ ఆదాయ పన్ను కట్టడంతో ఎన్నో ప్రయోజనాలు

**తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :**



ఆదాయపు పన్ను శాఖకు ముందస్తు ఆదాయపు పన్ను కట్టడం ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ కె .లోకేష్, తిరుపతి ఆదాయపు పన్ను అధికారి వసంత లక్ష్మి స్పష్టం చేశారు. తిరుపతిలో శుక్రవారం రాత్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నగర వ్యాపారులకు ఆదాయపు పన్నుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆదాయపు పన్ను శాఖకు అడ్వాన్స్ టాక్స్ కట్టడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈనెల 15న మంగళవారం 2వ కంతు కట్టుకునే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని నగర వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల బృందం, నగర వ్యాపారులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో భారీ కేసుల పరిష్కారం

**సత్యవేడు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**

సత్యవేడు మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఏ.వెంకటనాగరాజు ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌లో 1295 కేసులు పరిష్కరించబడ్డాయి. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ లోక్ అదాలత్‌లో 14 సివిల్ కేసులు, 1 ఆర్థిక నేరం కేసు, 65 క్రిమినల్ కేసులు, బ్యాంకు పీఎల్‌సీలు 15, పెట్టి కేసులు ఇతర కేసులతో 1200 మొత్తం 1295కేసులు ఇరు పక్షాల సమ్మతి మేరకు లోక్‌అదాలత్ నియామ నిబంధనలకు లోబడి పరిష్కరించబడ్డాయి. ఈ లోక్ అదాలత్‌ల ద్వారాసుమారు సివిల్, భూ సంబంధిత కేసులల్లో సుమారు 14 లక్షల 31 వేలు విలువ చేసే కేసు పరిష్కరించబడగా, ఆర్థిక నేరం కింద సుమారు 16 లక్షల నగదు జమైంది. బ్యాంకు పీఎల్‌సీ కింద సుమారు 11 లక్షల 75 వేల కేసు పరిష్కరించబడగా ఇతర కేసుల ద్వారా సుమారు నాలుగు లక్షల 84 వేలు నగదు రికవరీ చేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఏపీపీ లత, కోర్టు మండల న్యాయశాఖ, కోర్టు అధికారులు, పలువురు సీనియర్ జూనియర్ లాయర్లు, బ్యాంకు అధికారులు, పలువురు కక్షదారులు పాల్గొన్నారు.

## చంద్రబాబుని కలిసిన రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు



**పులిచెర్ల, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని శనివారం పుంగనూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు ఎ. రామనాథం నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్లాస్టిక్ వస్తువులు ఇవ్వండి .. మట్టి వినాయకుడిని తీసుకెళ్ళండి.!

డిపిఓ డి.సుశీలాదేవి



**చంద్రగిరి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

వినాయక చవితి పండుగ రోజున ఇంట్లో పూజ కోసం ప్లాస్టిక్ వస్తువులను ఇచ్చి మట్టి వినాయకుడిని తీసుకెళ్ళండని డిపిఓ డి.సుశీలాదేవి అన్నారు. పర్యావరణ రక్షణకై ఎంఎల్ఏ పులివర్తి నాని పిలుపు మేరకు.. స్థానిక గర్ల్స్ హైస్కూల్ వద్ద గల గ్రీన్ షాప్‌ను తనిఖీ చేసిన ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇందు కోసం ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తూ గ్రీన్ షాప్‌లో మట్టి వినాయకుడి ప్రతిమలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మీ ఇంట్లో గల పాత ప్లాస్టిక్ వస్తువులను గ్రీన్ షాప్‌లో అందజేసి మట్టి వినాయకుడి తీసుకునే విధంగా అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని మట్టి వినాయకుడి ప్రతిమలతోనే పూజలు నిర్వహించే విధంగా చొరవ చూపాలన్నారు. అనంతరం స్థానికుల నుండి ప్లాస్టిక్ వస్తువులను తీసుకుని మట్టివినాయకుడి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ డిప్యూటీ ఎంపిడిఓలు చంద్రశేఖర్ రెడ్డి, ఐ.ఎన్.షణ్ముగం, శానిటరీ మేస్త్రీ శివ, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శిగా సూరి



**చంద్రగిరి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శిగా సురేష్ అలియాస్ సూరిని నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి శనివారం ఉత్తర్వులిచ్చారు. చంద్రగిరి మండలం, మల్లయ్యపల్లికి చెందిన సూరి పార్టీలో చురుకైన కార్యకర్తగా సేవలందిస్తూ అంచెలంచెలుగా పార్టీ పదవులను పెంపొందించుకుంటున్నారు. ఇందులో భాగంగా మండల వాలంటరీ విభాగం అధ్యక్షుడుగా వున్న ఆయనను విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆశీస్సులతో తనకు లభించిన పదవికి న్యాయం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

## తిరుచ్చి వాహనంపై కళ్యాణ వెంకన్న



**చంద్రగిరి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకన్న విశేష అలంకరణలతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణల నడమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ పి.వరలక్ష్మి, ఏఇఓ ఎం.గోపినాధ్, సూపరింటెండెంట్ హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఓఎస్ బైరెడ్డి హరిప్రసాద్, అర్చకులు కళ్యాణ్ సుందర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో పి.జి.ఆర్.ఎస్ రద్దు

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి కలెక్టరేట్ , సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:**

తిరుపతి జిల్లా కలెక్టరేట్లో సెప్టెంబర్ 14వ తేదీన వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ శనివారం తెలిపారు.సెప్టెంబర్ 14 (సోమవారం) వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉన్న నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తిరుపతి డివిజన్

## పుత్తూరులో శ్రీవారి గొడుగులు ఊరేగింపు

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**





పుత్తూరులో శ్రీవెంకటేశ్వర స్వామివారి గొడుగులు యాత్ర శనివారం మేళతాళాలతో భజన భక్తి గీతాలతో వైభవంగా విశ్వ హిందూ పరిషత్ వారిచే 12వ సంవత్సరం కార్యక్రమం నిర్వహించారు. మొదట కన్యపూజ, శ్రీవారి పాదుకల పూజ, తరువాత ఈశ్వరాపురం స్వామి శివానంద ప్రారంభించారు. స్థానిక ఆర్‌డీఎం గేటు నుంచి ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, కార్వేటినగరం రోడ్డు, కాపువీధి, బజారు వీధి, శివాలయం మీదుగా సుబ్రహ్మణ్యం స్వామి గుడి, ద్రౌపదమ్మ గుడి వరకు గొడుగుల ఊరేగింపు జరిగింది. పుత్తూరు, పరిసర ప్రాంతాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొని, కర్పూర హారతి, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమిళనాడు విశ్వ హిందూ పరిషత్ నాయకులు రామలింగం, తంగవేలు, స్థానిక ఆర్ఎస్ఎస్ నాయకులు పేట బాలకృష్ణారెడ్డి, మేకల సుబ్రహ్మణ్యం, కోటకొండ బాబు, గోవిందరాజులు, మోహన్, రమేష్, ఆనందబాబు, యువరాజు, మురళమ్మ, తొరూరు బాబు, గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు. సాయంత్రం నారాయణవనం పురవీధుల్లో గొడుగుల ఊరేగింపు జరిగింది.

## దేశమ్మ ఆలయ క్లర్క్‌పై చర్యలు చేపట్టాలి

ఇఒకు వైకాపా నాయకులు ఫిర్యాదు



**పుత్తూరు(నగరి), సెప్టెంబరు 12 ప్రభాతవార్త :**

వైసిపికి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించేలా వ్యవహరించిన నగరి పట్టణంలోని దేశమ్మ ఆలయ టిక్కెట్ క్లర్క్ మోహనకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం దేశమ్మ గుడి కార్యనిర్వహణాధికారి మునికృష్ణమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్తుల ఆహ్వానం మేరకు విజయపురం మండలంలో ఒక కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్లిపోయారని, అయితే అదే రోజు సాయంత్రం జరిగిన ఒక సంఘటనను ఆమె పర్యటనతో ముడిపెడుతూ సోషల్ మీడియా గ్రూపుల్లో మాజీ మంత్రి ఫోటోను ఉపయోగించి తప్పుడు ప్రచారం చేశారని ఫిర్యాదు చేశారు. ఈ దుష్ప్రచారం వెనుక మోహనకృష్ణకు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్నాయా అనే అంశాన్ని కూడా విచారణలో పరిశీలించాలన్నారు. దేశమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేసిన ఘనత ఆర్.కె.రోజాకే దక్కుతుందన్నారు. మోహనకృష్ణపై గతంలో కూడ ఆరోపణలున్నాయన్నారు. వెంటనే అతనిపై విచారణ చేపట్టాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆలయ మాజీ ఛైర్మన్ వేణుబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, స్థానిక నాయకులు వెంకటేష్, శశికుమార్, ఉపాధ్యక్షుడు మునివేలు, కన్నాయిరం, మాజీ కౌన్సిలర్లు మురుగ, యాకోబు, భూపాలన్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు యువరాజ్, నాయకులు కృష్ణమూర్తి, కెఆర్ సలీమ్, ఆనంద్‌కుమార్, మేషాక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈని మర్యాద పూర్వకంగా కలసిన విద్యుత్ సిబ్బంది



**విజయపురం, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**

చిత్తూరు ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎగ్జికూటీవ్ ఇంజనీరు(ఈఈ) రఘును శనివారం మండల విద్యుత్‌శాఖ సిబ్బంది ఆయన స్వగృహం ఆలపాకంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో విద్యుత్‌శాఖలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు, గృహ వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్‌ని అందించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సదాశివం, లైన్ ఇన్‌స్పెక్టర్లు సదానందం, శ్రీనివాసులురెడ్డి, లైన్‌మెన్ సురేష్, రవి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

**విజయపురం, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**

నగరి నియోజకవర్గానికి కొత్తగా రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు నియోకజవర్గ టీడీపీ నాయకులు తెలిపారు. ఇందులో ఒకటి నగరి మండలంలోని అయనంబాకంలోను, మరొకటి విజయపురం మండలంలోని మహారాజపురంగ్రామంలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేసిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు పలువురు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

– 1740 నగదు స్వాధీనం



**నాగలాపురం, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:**

నాగలాపురం మండలం రాజులకండ్రిగ ఏఏడబ్ల్యు గ్రామం వెలుపల పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను నాగలాపురం పోలీసులు అరెస్టు చేశారు. 2026 సెప్టెంబరు 11వ తేదీన అందిన సమాచారం మేరకు నాగలాపురం పోలీసులు రాజుల కండ్రిగ ఏఏడబ్ల్యు గ్రామం వెలుపల తనిఖీ నిర్వహించగా, కొంత మంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి పేక ముక్కలతో పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి పేకాటకు ఉపయోగిస్తున్న రూ.1740 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడిన వ్యక్తులపై ఆంధ్రప్రదేశ్ గేమింగ్‌యాక్టు సెక్షన్ 9(1) కింద కేసు నమోదుచేసి చట్ట పరమైన చర్యలు చేపట్టారు. చట్టవిరుద్ధమైన పేకాట, జూదం వంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని, ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా : ఎంపీ గురుమూర్తి




బాలాయపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: హక్కుగా రావాల్సిన స్టైఫండ్‌ను చెల్లించాలని, తమ చదువులు సజావుగా కొనసాగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన చేపట్టిన పారామెడికల్ విద్యార్థులపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదాల చెంత అలిపిరి వద్ద పారా మెడికల్ విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన చేపట్టారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి గొంతును అణచివేసేందుకు పోలీసులతో దాడులు చేయించడం అత్యంత బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యార్థినుల జుట్టు పట్టుకుని నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లిన దృశ్యాలు మనసున్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయని అన్నారు. విద్యార్థులను పోలీసులు చితకబాదిన తీరు చూసి తన మనసు వేదనతో బరువెక్కిందని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు చెల్లించాలని రైతులు రోడ్డెక్కితే పోలీసులతో దాడులు చేయించడం చూశామని, ఇప్పుడు తమ హక్కుల కోసం ప్రశ్నించిన విద్యార్థులపై కూడా అదే విధంగా అమానవీయంగా వ్యవహరించడం దారుణమన్నారు. విద్యార్థుల సమస్యలను చర్చించి పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిని మరోసారి తీవ్రంగా ఖండిస్తున్నానని ఎంపీ తెలిపారు. పారామెడికల్ విద్యార్థుల న్యాయమైన పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు రావాల్సిన స్టైఫండ్‌ను చెల్లించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## నూతన ఉత్సాహంతో అందరూ పని చేయాలి

**- నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి**



బాలాయపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: నూతన ఉత్సాహంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవనంలో ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ఏకగ్రీవ ఎందుకు ఛాన్స్ లేదని తెలిపారు. ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జడ్పిటిసిలను జగన్మోహన్ రెడ్డికి కానుక ఇవ్వాలని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకునే లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. పార్టీలో పని అయిన వారికి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి గుర్తింపు ఉండదని తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఇస్తానని జగన్మోహన్‌రెడ్డి చెప్పారని తెలిపారు. పార్టీలో పనిచేయని వారికి గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఆనం రామాలయం రెడ్డి ఇక్కడ ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గాన్ని నాశనం చేశారని విమర్శించారు. ఆనం పక్కనపెట్టి తనకు ఇంచార్జి బాధ్యతలు జగన్మోహన్ రెడ్డి ఇచ్చినట్టు తెలిపారు. తన వంతు సాయి శక్తుల నియోజకవర్గం అభివృద్ధి చేశానని తెలిపారు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత రెడ్డి, మున్సిపల్ విభాగం కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, మండల కన్వీనర్లు శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు దశరథరామ్‌రెడ్డి, సతీష్, రాజారెడ్డి, సదాశివరెడ్డిలు పాల్గొన్నారు.

## డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు జరగలేదు

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



బాలాయపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : మెగా డిఎస్సిలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బంగారు పేటలో మెగా డీఎస్సీలో ఎంపికైన పసుపులేటి శిరీషను ఎమ్మెల్యే కలిసి మెగా డీఎస్సీ ఎంపీపీ పై అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా కట్టలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తుంటే లేనిపోని ఆరోపణ చేస్తున్నట్లు విమర్శించారు. మెగా డీఎస్సీపై జగన్మోహన్‌రెడ్డి విషం కకుతున్నట్లు చెప్పారు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరగలేదని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగితే నిరూపించాలని మంత్రి లోకేష్ జగన్‌కి సవాల్ చేస్తే ఆయన రాలేదని చెప్పారు. పేదలందరూ మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎందుకు అయినట్టు తెలిపారు. ఉపాధ్యాయులందరూ ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడు ఆర్డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, నాయకులు ఆనంద్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పన్ను ఎగ్గొట్టి... వరి దాన్యం తరలింపా!

**-సరిహద్దు మార్గంలో వడ్ల లారీలను అడ్డుకున్న ఏఎంసీ చైర్మన్**
**-నిబంధనల ప్రకారం పన్ను వసూలు-తనిఖీలు ముమ్మరం చేస్తామని హెచ్చరిక**




నాగలాపురం, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: వరిపంట సీజన్ కావడంతో వడ్ల వ్యాపారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో పన్ను ఎగవేసి వడ్లను తమిళనాడు వైపు తరలిస్తున్నారన్న ఆరోపణలపై నాగలాపురం ఏఎంసీ అధికారులు నిఘా పెంచారు. పిచ్చాటూరు మండల పరిధిలోని హనుమంతాపురం, ఎస్ఎస్‌బీ పేట రోడ్డు మీదుగా తమిళనాడు సరిహద్దు గ్రామాలకు వెళ్లే మార్గంలో చెక్‌పోస్టు, అబ్జర్వర్ చెక్‌పోస్టు లేకపోవడాన్ని కొందరు వ్యాపారులు అను కూలంగా మార్చుకుంటున్నట్లు సమాచారం. ఈ మార్గం ద్వారా పన్ను చెల్లించకుండా వడ్ల లారీలను తమిళనాడు వైపు తరలిస్తున్న విషయాన్ని గమనించిన నాగలాపురం ఏఎంసీ చైర్మన్ దామోధరన్ శుక్రవారం స్వయంగా ఆ మార్గంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వెళుతున్న వడ్ల లారీలను అడ్డుకుని, వెంటనే ఏఎంసీ సిబ్బందిని అక్కడికి పిలిపించారు. లారీలకు సంబంధించిన వివరాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ఏఎంసీ పన్ను రసీదులు జారీ చేసిపన్ను వసూలు చేయించారు.

**ఆదాయానికి గండికొడితే చర్యలు తప్పవు:**

ఏఎంసీ ఆదాయానికి గండికొట్టే విధంగా పన్నుచెల్లించకుండా వ్యవసాయ ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు తరలించే వారిపై చర్యలు తప్పవని చైర్మన్ దామోధరన్ హెచ్చరించారు. సరిహద్దు ప్రాంతాల నుంచి జరిగే వడ్ల రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అవసరమైన చోట్ల తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు.

**చెక్‌పోస్టు ఏర్పాటుపై దృష్టి:**

తమిళనాడు సరిహద్దు వైపు వెళ్లే మార్గాల్లో పన్ను ఎగవేతకు అవకాశం లేకుండా పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. చెక్‌పోస్టు, అబ్జర్వర్ చెక్‌పోస్టు లేని మార్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే ఏఎంసీ ఆదాయం పెరగడంతో పాటు పన్ను ఎగవేతకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

## మట్టి గణపతి విగ్రహాలను




తడ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అని తడ మండల వైస్ ఎంపీపీ కుప్పంపాటి వెంకటేష్ పిలుపునిచ్చారు. అదేవిధంగా పరిశ్రమలను వాహనాల నుండి అధిక మోతాదులో రసాయనాలు వాడడం ద్వారా నేడు వాతావరణంలో తీవ్ర మార్పులు సంభవించాయని 2026 సంవత్సరంలో ప్రపంచ పర్యావరణ సంబంధించి సర్వే నిర్వహించగా 177 దేశాల్లో భారతదేశం చివరి 176వ స్థానంలో నిలిచింది భారతదేశంలో గాలి నీరు పర్యావరణం మొత్తం కలుషితమైందని ఇలాగే కొనసాగితే నేటి, రేపటి తరాలకు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రభుత్వాలతోపాటు ప్రజల్లో యువతలో మార్పు రావాలని పర్యావరణాన్ని కాపాడుకునేందుకు నడుం బిగించాలని వెంకటేష్ పిలుపునిచ్చారు. విషపూరితమైన వ్యర్థాలతో తయారుచేసిన గణపతి విగ్రహాలు చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితంగా మారుతున్నాయని మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. అదేవిధంగా గణనాధుని ఊరేగింపు సమయంలో కరెంటు, టపాకాయలతో జాగ్రత్త వహించాలని అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేయండి

**-గవర్నర్, సిఎంలకు టిటిడి ఆహ్వానపత్రికలు**



తిరుమల, సెప్టెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు, సిఎం చంద్రబాబు నాయుడుకు టిటిడి ఆహ్వాన పత్రికలు అందించింది. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర శనివారం ఉదయం ఉండవల్లిలోని సిఎం నివాసంలో కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ ్మ, జానకిదేవి పాల్గొన్నారను. ఈ సందర్భంగా టిటిడి వేద పండితులు ముఖ్య మంత్రికి వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు టిటిడి అధికారులతో చర్చించారు. అలాగే రాష్ట్రగవర్నర్ నజీర్‌కు కూడా ఆహ్వానపత్రిక అందించారు.

## భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



తిరుపతి, సెప్టెంబర్ 12ప్రభాతవార్త: తిరుపతి నగరం శనివారం తెల్లవారుజామున భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. బ్రహ్మముహూర్తానికే భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో గోవింద రాజస్వామి ఆలయం నుండి గోవింద.. గోవింద.. అంటూ నామసంకీర్తనతో భజనలతో మేల్కొలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు చంద్రమోళి, మునినాథరెడ్డి, సురేంద్ర రాజు, కృష్ణంరాజు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, పురుషోత్తమ యాదవ్, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో పలువురు ప్రముఖులు





కాణిపాకం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈమేరకు కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సీతారం, శ్రీవాత్సవ, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్‌లు వేర్వేరుగా కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ చైర్మన్ మణినాయుడు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో పాలకమండలి సభ్యులు శివప్రసాద్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, బాలాజినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## 365 మందితో కాణిపాకం బ్రహ్మోత్సవాలకు బందోబస్తు

**-చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు**

కాణిపాకం, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు 365 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన 'ప్రభాతవార్త' తో మాట్లాడుతూ దేవస్థానంలో సోమవారం నుండి అక్టోబర్ 4వరకు స్వామివారి బ్రహ్మోత్స వాలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశముందని తెలిపారు. కావున ఉత్సవాలను ప్రశాంతంగా సజావుగా నిర్వహించడానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఒక ఏస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 7 మంది సీఐలు, 21మంది ఎస్ఐలతో పాటు 336 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆలయ వెలుపల, బయట ఆలయ భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈసిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ పరిసరాల్లో ప్రస్తుతమున్న సీసీ కెమెరాలతో అదనపు సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా వుంచుతున్నట్లు సీఐ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి తొక్కిసలాటలు, అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## మేడ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా చలపతి

**- దేవపాల్ నాయకత్వంలో మేడ్‌కు కొత్త ఊపు**

**- రాష్ట్ర కార్యవర్గంలో చిట్టమూరు ఉపాధ్యాయుడు చలపతికి చోటు**




చిట్టమూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ (మేడ్) రాష్ట్ర కార్యవర్గ 8వ సమావేశం గుంటూరులో రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అధ్యక్షతన శనివారం ఘనంగా జరిగింది. దళిత ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక బాధ్యత, ఉద్యోగుల ఐక్యత వంటి అంశాలపై మేడ్ నిరంతరం పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతోందని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. సంస్థను మరింత బలోపేతం చేస్తూ ఉద్యోగుల సమస్యలను సమష్టిగా ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర స్థాయి నూతన కార్యవర్గాన్ని సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం మన్నెమాల గ్రామానికి చెందిన జడ చలపతి మేడ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుడిగా సేవ ఇప్పుడు ఉద్యోగుల కోసం మరో బాధ్యజడ చలపతి ప్రస్తుతం ఆరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యాబోధనతో పాటు సామాజిక బాధ్యత పట్ల ఆసక్తి చూపుతూ, ఉద్యోగుల సమస్యలు మరియు సంస్థాగత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న నేపథ్యంలో రాష్ట్ర కార్యవర్గంలో కీలక బాధ్యత దక్కడం పట్ల మన్నెమాల గ్రామస్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేడ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నిక కావడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని, సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర స్థాయిలో సమర్థవంతంగా వినిపించేందుకు కృషి చేస్తానని జడ చలపతి పేర్కొన్నారు. మన్నెమాల గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి కార్యవర్గంలో కీలక బాధ్యతను అందుకోవడం స్థానికంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

## న్యాయ వ్యవస్థపై ప్రజల్లో...నమ్మకం పెరుగుతోంది

**- జిల్లా జడ్జ్ నరసింహమూర్తి**



బాలాయపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: న్యాయ వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం పెరిగిందని జిల్లా జడ్జి ఏ నరసింహమూర్తి తెలిపారు. లోక్ అదాలత్లో జిల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వ్యవస్థను ప్రజల్లో నమ్మకం కలుగుతుందని న్యాయ వ్యవస్థ పై పెరుగుతున్నట్లు చెప్పారు. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఇంకా నమ్మకం పెంచాలని తెలిపారు. కోర్టులో సిబ్బంది తక్కువగా ఉన్నారని నియమిస్తామని తెలిపారు. జూనియర్స్ విష్ణువర్మ పనితీరు బాగుందని న్యాయవాదులందరూ చెప్పడం హర్షించ దగ్గ విషయం అన్నారు. సీనియర్ న్యాయవాది లక్కమనేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కోర్టులో సిబ్బంది తక్కువగా ఉన్నారని చెప్పారు. కోర్టులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్నట్లు తెలిపారు. జూనియర్ జడ్జి విష్ణువర్ధన్ పనితీరు బాగుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, గాంధీ, రాజారావు, రాజేష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 6 ఇసుక ట్రాక్టర్ల సీజ్!



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, అతివేగంగా దూసుకు వెళుతూ హైవేపై హల్చల్ చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేవలం ఇళ్ల నిర్మాణాలు జరుపుకునే వారికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను రవాణా చేసుకొనుటకు అనుమతినిచ్చింది అది కూడా రెవెన్యూశాఖ పరిధిలో తాము నివాసముండే ప్రాంతంలోని స్థానిక సచివాలయం నందు హనుమతుల తీసుకొని రవాణా చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇవన్నీ ఏమీ పట్టనట్లుగా ప్రతిరోజు అధిక సంఖ్యలో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు హైవేపై అధిక వేగంతో దూసుకు వెళుతూ నిబంధనలకు తూట్లు పడుతున్నాయి. ఈ అక్రమ ఇసుక రవాణాలో భాగంగా నిర్వాహకుల మధ్య, స్థానిక హోలీ క్రాస్ సర్కిల్ సమీపంలో సరిహద్దు గొడవలు చెలరేగడంతో, ఈ సమాచారం స్థానిక పోలీస్ శాఖ వారికి చేరింది. వెంటనే సూళ్లూరుపేట సబ్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ హోలీ క్రాస్ సమీపంలో అక్రమ ఇసుకను రవాణా చేస్తున్న 6 ట్రాక్టర్లను తన సిబ్బందితో కలిసి స్వాధీనపరుచుకున్నారు. ఈ ఘటనలో ఒక ట్రాక్టర్‌కి సంబంధించిన డ్రైవర్ పరారు కాగా, మొత్తం ట్రాక్టర్లను ఆర్టీసీ డిపోకు తరలించారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసు రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఈ ఇసుక అక్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకుంటే, జాతీయ రహదారిపై జరుగుతున్న పలు ప్రమాదాలను నియంత్రించవచ్చు.

## పర్యావరణ పరిరక్షణకు... మట్టి వినాయకులనే పూజించాలి

**-ఉచితంగా విగ్రహాలు పంపిణీ**



తిరుపతి, సెప్టెంబర్ 12ప్రభాతవార్త: ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం భక్తులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. భక్తితో బాటు ప్రకృతి పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని అన్నారు. సహజ సిద్ధమైన మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజించాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా వేలాది మంది భక్తులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

**పాస్‌పోర్టు దారపోయింది**

చల్లా గోవిందస్వామి మధుసూధనరావు, తండ్రి చల్లా గోవిందస్వామి అనే నేను, ఇల్లు మాతున్న సమయంలో, నా పాస్ పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. A2857613, కావున దయచేసి దొరికినవారు ఈ పోన్ నెంబరు: 8639278947, అడ్రస్సు: డి.నెం.17-56, పానగల్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు తెలియజేయగలరు

13 CTR 5:13 CTR 5.qxd 9/12/2026 11:11 PM Page 1



## కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన పెన్షనర్లు

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 12 (ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్స్ కు పెండింగ్‌లో ఉన్న, డిఏ బకాయిలు చెల్లింపులకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం రెండు జీవోలు విడుదల చేసిందని ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, కూటమి ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలుపుతు తున్నామని ఏ.పి విశ్రాంత ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే ఆర్ శంకర్, టి. వెంకటేశం శెట్టి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం తిరుపతి నగర శాఖ నెలవారీ సమావేశం యల్ఐసి రోడ్డులోని సంఘం భవనం లో అధ్యక్షుడు కే ఆర్.శంకర్ అధ్యక్ష తన శనివారం ఉదయం జరిగింది. శంకర్ మాట్లాడుతూ డి.ఏ బకాయిలను విడతల వారీగా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు సంభందించి పలు అంశాలను ఇంకా ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన టిడిపి రాష్ట్ర ఇంఛార్జి జెబి శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇటీవల విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సంఘానికి కార్యదర్శులుగా ఎన్నికైన కే ఆర్.శంకర్, టి. గోపాల్‌లను నేటి సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సంఘం కార్య నిర్వాహక సభ్యులు పుల్లయ్య, టి.వి. రమణ, కృష్ణ మూర్తి, రవనప్ప, మేహరున్ని బీ, పలువురు సంఘం నాయకులు పాల్గన్నారు. ఈ సమావేశంలో యస్వి. అరవింద కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రదానం గురించి వివరించారు. స్విమ్స్ విశ్రాంత కార్డియాలజీ వైద్యులు డాక్టర్ ఆర్ రాజశేఖర్ అమర ఆసుపత్రి తరపున సమావేశంలో పాల్గొని హృద్యోగ సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. అమర ఆసుపత్రి నిర్వాహకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు.

## వినాయక విగ్రహాల వద్ద విద్యుత్ భద్రతను పాటించండి

– డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆంజనేయులు విజ్ఞప్తి

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



తిరుపతి ఆపరేషన్ సబ్ డివిజన్ 1 పరిధిలోని, ఖాదీ కాలనీ, వరదరాజ నగర్, చెన్నారెడ్డి కాలనీ, బాలాజీ కాలనీ, గిరిపురం, రిజర్వాయర్ కాలనీ, గాంధీరోడ్డు, ప్రకాశం రోడ్, కర్ణాలవీధి, ముత్యాలరెడ్డిపల్లి, వైకుంఠపురం ఆర్చి రోడ్, మునిరెడ్డి నగర్, న్యూ బాలాజీ కాలనీ, వాసవి నగర్, తిరుమల నగర్, గాంధీపురం విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ సబ్ డివిజన్ 1 నుండి పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి వేడుకలను ఆనందంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, విద్యుత్ భద్రతను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దు అని, విద్యుత్ లైన్లు, పోల్స్, ట్రాన్స్ ఫార్మర్లకు సురక్షిత దూరం పాటించాలని,విద్యుత్ వైర్లు తెగిపడినప్పుడు వాటిని తాకకుండా వెంటనే వారి పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని కోరారు. ఖాదీ కాలనీ ఏరియా :9490615001, బాలాజీ కాలనీ: 9490615002, గాంధీ రోడ్డు: 9492806890, ఎంఆర్ పల్లి: 9490615003 నంబర్స్ ని సంప్రదించాలని, విద్యుత్ భద్రత మనందరి బాధ్యతగా మెలగాలన్నారు.

## స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతిని మర్యాదపూర్వకంగా కలిసిన పలువురు ప్రముఖులు




తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) స్విమ్స్ సంచాలకులు. ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం నందు పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతిని మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో తిరుపతి మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ టీటీడీ పాలకమండల్ సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం, రాఘవేంద్ర, రామచంద్రాపురం మండలం మాజీ ఎంపీపీ కేశవులు నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్చాలు సమర్పించి శాలువలతో సత్కరించారు. స్విమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. గుడారు జగదీష్ పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి టీటీడీకి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వీరు ఆకాంక్షించారు.

## మెడికల్ సీటు కోల్పోకుండా ఒక్క అవకాశం కల్పించండి సారూ!

– విద్యార్థి పి తేజ విజ్ఞప్తి

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



తిరుపతి రూరల్ మండలంకు చెందిన పి తేజ 2026 నీట్ పరీక్షల్లో 550 మార్కులు వచ్చాయని ఆల్ ఇండియా కోటాలో సీటు వస్తుందని భావించి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్‌కి దరఖాస్తు చేయలేదని విద్యార్థి పి తేజ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అతను తన తండ్రితో కలిసి మాట్లాడాడు. నేషనల్ మెడికల్ కమిషన్ జరిపే ఆల్ ఇండియా కోట కౌన్సిల్లో మూడు రౌండ్లు ఉంటాయని ప్రతి రౌండ్ కు దరఖాస్తు చేసుకునే అవకాశం వుందని, అలాగే మన రాష్ట్రంలో కూడా ఉంటుందని భావించానని, అది నా పొరపాటే అన్నారు. తను ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి చెందిన జనరల్ కేటగిరి విద్యార్థినని, దయచేసి నేషనల్ మెడికల్ కమిషర్ లాగా 2వ రౌండ్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించండి సారూ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ఒక్క అవకాశం నాకే కాకుండా నాలాగా పొరపాటు చేసిన మరి కొంత మంది విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కూడా ప్రతి రౌండ్‌కు దరఖాస్తు పెట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.మెడికల్ సీట్ కోల్పోకుండా, విద్యా సంవత్సరం కోల్పోకుండా చేయగలరని, అదే విధంగా హైకోర్టు వారు కూడా ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి తనకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

## ఫ్రీ మెడికల్ క్యాంపు పేరుతో ప్రాణాలు తీస్తున్నారు

– ఆర్ గోవిందస్వామి కుటుంబ సభ్యుల ఆవేదన

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త



ఎంఏ రాజుల కండ్రిగ గ్రామం, కెవిబి పురం మండలం కు చెందిన ఆర్ గోవిందస్వామి కుమారుడు ఆర్ గిరి మాట్లాడుతూ తన తండ్రిని తిరుపతి ఎయిర్పోర్ట్ రోడ్డు, రేణిగుంట నందు గల శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారు ఫ్రీ మెడికల్ క్యాంపు పేరుతో తన తండ్రిని ఆగస్టు 10న తీసుకెళ్ళి, మూడు రోజులు అక్కడే పెట్టుకుని చనిపోయాడని చెప్పారని ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. వాళ్ల నాన్నకి ఎటువంటి జబ్బులు లేవు అని, కాలు నొప్పి మాత్రమే ఉన్నదని (ఆర్థోపెటిక్), ఇప్పుడు ఆసుపత్రి వాళ్ళు కిడ్నీ, లివర్, పాడైపోయాయని, లేనిపోని జబ్బులు పేర్లు చెబుతున్నారని అన్నారు. ఆగస్టు 10 వరకు కరువు పనులు చేసి బిల్లులు పొందిన వ్యక్తి సడన్‌గా చనిపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ పై కేసు నమోదు చేసి, చనిపోయిన ఆర్ గోవిందస్వామి పార్థివ దేహానికి పోస్టుమార్టం చేయాలని కోరారు. ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్లు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని,అతడికి సపోర్టుగా అటెండర్ కూడా లేరని వ్యక్తికి ఆసుపత్రి డాక్టర్స్ ఎలా ట్రీట్మెంట్ చేస్తారన్నారు. సంబంధిత అధికారులు ఆసుపత్రి మీద విచారణ జరిపి, డాక్టర్స్ పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి,ఆస్పత్రిని శాశ్వతంగా మూసివేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, జిల్లా కలెక్టర్, తిరుపతి ఎస్పీకి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తనకు జరిగిన అన్యాయం ఇంకా ఏ పేద కుటుంబానికి జరగకూడదు అని, ఫ్రీ మెడికల్ క్యాంపులతో మోసపోవద్దని ప్రజలును కోరారు.

## వినాయక చవితికి పర్యావరణహిత బాట

మట్టి విగ్రహాల పంపిణీ అభినందనీయం: ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య సెప్టెంబర్ 12 ప్రభాత వార్త

పండుగ వేడుకల్లో భక్తితోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల కుంటలు, చెరువుల్లో కాలుష్యం పెరుగుతోందని తెలిపారు.కొత్తవీధిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలకు విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా చేసుకుని సంఘం చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు.వినాయక మండపాల్లోనూ మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పండుగను ఘనంగా నిర్వహించడంతోపాటు నిమజ్జనం అనంతరం నీటి వనరులకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కల్పించారని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, కార్యదర్శి కామిశెట్టి శ్రీధర్, కోశాధికారి హేమచంద్రకుమార్, కొత్తవీధి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ వినోద్ రాయల్, వేశాలమ్మ ఆలయ పాలకమండలి సభ్యుడు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నైలిట్ కేంద్రం తరలింపు ప్రచారం అవాస్తవం

విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
తిరుపతిలోనే కేంద్రం కొనసాగుతుంది: డైరెక్టర్ శశికుమార్
4,300 మందికి పైగా సాంకేతిక శిక్షణ

తిరుపతి విద్య, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



తిరుపతిలోని నైలిట్ కేంద్రం తరలిపోతుందంటూ జరుగుతున్న ప్రచారానికి ఆ సంస్థ డైరెక్టర్ శశికుమార్ తెరదించారు. కేంద్రం తరలింపు కేవలం అపోహ మాత్రమేనని, విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తిరుపతిలో నైలిట్ కార్యకలాపాలు కొనసాగుతాయని, భవిష్యత్‌లో మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.శనివారం సాయంత్రం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని నైలిట్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో నైలిట్ కేంద్రం ఏర్పాటుకు 2024 జనవరి 4న ఆమోదం లభించిందన్నారు. కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, అధ్యాపకులు తదితర 4,300 మందికి పైగా వివిధ సాంకేతిక శిక్షణలు పొందారని శశికుమార్ తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, పశువైద్య విశ్వవిద్యాలయం, మోహన్‌బాబు విశ్వవిద్యాలయంతోపాటు ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు శిక్షణ అందించినట్లు చెప్పారు. సైబర్ భద్రత, సాంకేతిక అంశాలపై ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు సిబ్బందికి కూడా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.తిరుపతిలో నైలిట్‌కు శాశ్వత భవనం నిర్మించేందుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కనీసం రెండు ఎకరాల స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. స్థల కేటాయింపు ప్రక్రియ పరిశీలనలో ఉందన్నారు. జనవరి 2027 వరకు ప్రాజెక్టు విధానంలో కొనసాగనున్న కేంద్రం అనంతరం పూర్తి స్థాయి స్వతంత్ర కేంద్రంగా పనిచేయనుందని వెల్లడించారు.తిరుపతి కేంద్రం తరలిపోతుందన్న ప్రచారాన్ని నమ్మవద్దని, విద్యార్థులు, నిరుద్యోగులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని శశికుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, సైబర్ భద్రతా శిక్షణలను మరింత విస్తృతం చేయడమే లక్ష్యంగా నైలిట్ ముందుకు సాగుతుందని తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్ట్

– 4.6 కేజీల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ఘటన తిరుపతిలోని ప్రముఖ ప్రైవేట్ కళాశాల సమీపన ఎస్ వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటిచేసుకుంది. యూనివర్సిటీ సీఐ నరేష్ సమాచారం మేరకు చిత్తూరు జిల్లా, మంగసముద్రంకు చెందిన లక్ష్మీదేవి ప్రముఖ ప్రైవేట్ కళాశాల సమీపన గంజాయిని తరలిస్తూ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పక్క సమాచారంతో ఆమెను సోదా చేసారు. ఆమె వద్ద 4.6 కేజీ గంజాయి లభించడంతో గంజాయి స్వాదీనం చేసుకుని నిందతురాలిని అరెస్ట్ చేసారు. అనంతరం సంబంధిత కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## రాష్ట్ర బేస్‌బాల్ బరిలో గేట్ విద్యార్థిని మేఘన

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకు గుర్తింపు..
జాతీయస్థాయే లక్ష్యంగా ముందడుగు

తిరుపతివిద్య, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతున్న గేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాల విద్యార్థిని మేఘన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఆమెకు రాష్ట్ర జట్టులో చోటు దక్కింది.చిగురువాడలోని కళాశాలలో బీసీఏ (ఏఐ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న మేఘనకు చిన్ననాటి నుంచే బేస్‌బాల్‌పై ఆసక్తి ఉంది. ఇప్పటికే పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన ఆమె.. తాజాగా జిల్లా స్థాయిలోనూ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ పోటీలు ఈ నెల 12 నుంచి 14 వరకు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరగనున్నాయి.క్రీడల్లో విద్యార్థులు రాణించడం అభినందనీయమని కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభకు యాజమాన్యం నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.మేఘన జాతీయస్థాయికి ఎంపికై కళాశాలతోపాటు తిరుపతి జిల్లాకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపల్ ప్రణీత్‌కుమార్ ఆకాంక్షించారు. ఆమెకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు మేఘనను అభినందించారు.

## జనసేన ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు వితరణ



వరదయ్యపాలెం, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త

మండలంలోని జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో వరదయ్యపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం నందు పనిచేస్తున్న 21 మంది పారిశుద్ధ్య కార్మికులకు జనసేన నాయకుల ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేసారు. అనంతరం జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, తడ, శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశ్రమంగా ఉంచడంలో పారిశుద్ధ కార్మికుల సేవలో ఎంతో కీలకమని అభినందించారు. అలాగే కరోనా టైంలో కూడా గ్రామాల్లో పట్టణాల్లోను పరిశుభ్రంగా ఉంచుతూ కీలక పాత్ర పోషించిన పారిశుద్ధ కార్మికులకు ఈరోజు మా జనసేన నాయకులు ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉంది అలాగే మా జనసేన పార్టీ నుంచి వాళ్ళకి ఎప్పుడు మా సేవలందిస్తూ మునుముందు మరెన్నో సేవలు అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జానకి రామయ్య, ఆర్‌కె శ్రీను, శేఖర్, శ్రీధర్, చిరంజీవి, సాగర్, లోహిత్, మురళి, తరుణ్, యుగేష్, బిజెపి మండల అధ్యక్షుడు, ఢిల్లీ రాయల్, పంచాయతీ పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీరామ కళాశాల విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ప్రాంగణ ఎంపికల్లో ఐదుగురు ఎలక్ట్రికల్ విద్యార్థుల ప్రతిభ



తిరుపతి విద్య, సెప్టెంబర్ 12 ప్రభాత వార్త

శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. యత్వా ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి కొలువులను సొంతం చేసుకున్నారు. రాత పరీక్ష, సాంకేతిక పరీక్ష, ఇంటర్వ్యూ తదితర దశల్లో తమ నైపుణ్యాన్ని చాటారు.కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యం, ఉద్యోగ నియామకాలకు అవసరమైన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచేందుకు దోహదపడుతోందన్నారు.విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని మన్నెం రామిరెడ్డి అన్నారు. ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రవిమారుతి రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, సమస్యలను పరిష్కరించే విధానం, విషయ పరిజ్ఞానం తదితర అంశాలను పరిశీలించి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్. వాసు, ఉద్యోగ నియామకాల అధికారి టి. విష్ణువర్ధన్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లూరు సుబ్రమణ్యానికి కీలక బాధ్యత

వర్శిటీ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నిక

తిరుపతి విద్య, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త



విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగుల సమస్యలను జాతీయ స్థాయిలో వినిపించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నెల్లూరు సుబ్రమణ్యానికి కీలక బాధ్యత దక్కింది. అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శిగా ఆయన శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.దక్షిణ భారతదేశంలోని విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం తదితర అంశాలపై సమర్థవంతంగా పనిచేయాల్సిన బాధ్యతను సుబ్రమణ్యంపై సంఘం ఉంచింది. వివిధ రాష్ట్రాల్లోని ఉద్యోగ సంఘాలను సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుందని ప్రతినిధులు తెలిపారు.విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగుల సమస్యలను జాతీయ వేదికపై మరింత బలంగా ప్రస్తావించేందుకు సుబ్రమణ్యం ఎన్నిక దోహదపడుతుందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సుబ్రమణ్యానికి పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్షకు సెప్టెంబరు 30లోగా దరఖాస్తు

ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు జాతీయ స్థాయి పరీక్ష

తిరుపతి విద్య సెప్టెంబర్ 12 ప్రభాత వార్త




రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్‌లో 2027 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 30 చివరి తేదీ అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.అభ్యర్థుల అర్హతలు: 2027 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతిలో ప్రవేశం కోరుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2013 జూలై 2 నుంచి 2015 జనవరి 1 మధ్య జన్మించిన వారు మాత్రమే వయోపరంగా అర్హులు. అంటే 2013 జూలై 2 కంటే ముందు లేదా 2015 జనవరి 1 తర్వాత జన్మించిన వారు ఈ ప్రవేశానికి అర్హులు కారు. బాలబా లికలు ఇద్దరూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.ప్రవేశ పరీక్ష డిసెంబరు 6న నిర్వహించనున్నారు. గణితం, ఆంగ్లం, సాధారణ విజ్ఞానం ప్రధాన అంశాలుగా పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను తదుపరి ఎంపిక ప్రక్రియకు పిలుస్తారు. ఆ ప్రక్రియలో అర్హత సాధించిన వారికి రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో ఎనిమిదో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు.దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఒకటైన రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో ప్రవేశం పొందేందుకు విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని డా. విశ్వనాథ్‌రెడ్డి సూచించారు.

## మెకానికల్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ ధర్మారెడ్డి

ఎస్వీయూసీఈలో కీలక బాధ్యతల స్వీకరణ

తిరుపతి విద్య సెప్టెంబర్ 12 ప్రభాత వార్త



ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ కె. ధర్మారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. విద్యా, పరిపాలనా రంగాల్లో అనుభవం ఉన్న ఆయనకు విభాగాధిపతి బాధ్యతలు అప్పగించడంతో మెకానికల్ విభాగం మరింత అభివృద్ధి దిశగా సాగుతుందని కళాశాల వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.ప్రస్తుతం ప్రొఫెసర్ ధర్మారెడ్డి కళాశాలలో పరీక్షల ప్రధాన పర్యవేక్షకుడిగా, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం స్నాతక విద్యా విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో విశ్వవిద్యాలయ రవాణా అధికారిగా కూడా సేవలందించారు. విద్యా వ్యవహారాలతోపాటు పరిపాలనా బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది.కొత్త బాధ్యతల్లో భాగంగా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనలకు ప్రోత్సాహం, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని అధ్యాపకులు తెలిపారు. విభాగంలో విద్యా, పరిశోధన కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు ఆయన అనుభవం దోహదపడుతుందని పేర్కొన్నారు.బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కె. ధర్మారెడ్డిని అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.ఆయన నాయకత్వంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వినాయక మహోత్సవ కమిటీ సేవలు భేష్

తిరుపతి, సెప్టెంబర్ 12ప్రభాతవార్త:



తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయంలో శనివారం ముఖ్య అతిథిగా యస్. విష్ణు వర్ధన్ రెడ్డి విచ్చేసి పూజాధి కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, హేమ కిరణ్, శివ రాయల్ ఎస్వీఎం వెంకటేష్ కరాటే శీను, , చెన్నం నవీన్, పెరియ స్వామి రామ్ కుమార్, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లారపు రవిప్రసాద్, వరప్రసాద్, కారణాటం మురళి, మల్ల కుప్పం శేఖర, చంద్ర, వాసు, గోపి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తి డివిజన్

## శివయ్య సేవలో సమాచారశాఖ మంత్రి



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శనివారం రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసులు కుటుంబసభ్యులతో కలసి మహిమాన్విత పూజలను జరిపించుకున్నారు. మంత్రి వాయులింగేశ్వరుని దర్శనానికి రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ బికె వెంకటేశులు, ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులచే ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఆలయంలోని ప్రతి పరివార దేవత ఆలయం వద్ద దర్శనం చేసుకుంటూ ఆ దేవత ప్రాధాన్యతను ఆలయ అర్చకుల ద్వారా తెలుసుకున్నారు. ఇక్కడ నిర్మించిన బంగారు ధ్వజస్తంభం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద ఆలయమర్యాదలతో వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకర్ల గుర్రప్పశెట్టిలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వాములు పర్యవేక్షించారు.

## శనీశ్వరునికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం విశేష సంఖ్యలో తైలాభిషేకం జరిపారు. ఇక్కడ అర్చకుడు రామకృష్ణ సారధ్యంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. శనివారం ఆలయంలో విగ్రహ రూపంలో వెలసిన శనీశ్వరునికి స్థానిక భక్తులు విశేష సంఖ్యలో వివిధ సుగంధాలతో అభిషేకించటం జరుగుతుంది. ఈ నేపధ్యంలో శనివారం స్థానిక భక్తులే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు,కర్నాటకల నుంచి వచ్చిన భక్తులు కూడా శనీశ్వరుని సేవల్లో పాల్గొన్నారు. గతంలో ఇక్కడ ఉచితంగా నిర్వహించే అభిషేకాలను ప్రస్తుతం సేవగా నిర్వహిస్తున్నారు. కాగా శనివారం సందర్భంగా అభయ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకారాలు జరిపారు.

## పరశురాముని సేవలో ఆర్‌పి



ఏర్పేడు,సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: మండలంలోని గుడిమల్లం ఆలయంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని సేవలో శనివారం ప్రముఖ సంగీత దర్శకులు,నటులు,గాయకులు ఆర్‌పి పట్నాయక్ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. తిరుపతి జిల్లాలోని ఆలయాలతో సన్నిహిత సంబంధం ఉన్న పట్నాయక్ శనివారం గుడిమల్లంకు రాగా ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మెన్ బత్తల గిరి నాయుడు ఆలయ ఇఒ మునిశేఖర్ వేదపండితులతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. పరశురామేశ్వరుని దర్శించుకోవటం తమ పూర్వజన్మసుకృతం అన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం జడ్జి కృష్ణన్ కుటి



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: రాజీ మార్గమే రాజ మార్గమని,తక్కువ ఖర్చు,తక్కువ సమయంలో న్యాయం పొందేందుకు లోక్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని 12వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కృష్ణన్ కుట్టి మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పని, దీనికి అప్పీల్ ఉండదని తెలిపారు. సివిల్ కేసులు, రాజీకి వీలైన క్రిమినల్ కేసులు, కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీ లిటిగేషన్ కేసులను కూడా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ శిల్పా, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఉన్నతాధికారులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## గంగిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



తొట్టంబేడు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం జ్ఞానమ్మ కండ్రిగ కొత్త కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ తండ్రి ఎన్.గంగిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గంగిరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, ఎంపీటీసీ గరటారెడ్డి, పి. రామచంద్రారెడ్డి, బాబురెడ్డి, చంగల్రాయలు రెడ్డి, రామచంద్రారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఖగోళ పరిశోధనల్లో...తిరుపతి ఐఐటి కీలక ముందడుగు

## -ఐఐటీ, ఐయూసీఏఏ మధ్య అవగాహన ఒప్పందం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: ఖగోళ పరిశోధనల్లో తిరుపతి ఐఐటి కీలకంగా వ్యవహారిస్తుందని తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొపెసర్ సత్యనారాయణ అన్నారు. శనివారం కొత్త ఒప్పందాన్ని చేసుకున్నారు. ఐఐటి కొత్త ఒప్పందాలతో సంచాలనాలు సృష్టిస్తూ సాంకేతిక రంగంలో పరుగులు తీస్తుందని సత్యనారాయణ వివరించారు. రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్న 2047 వికసిత్ భారత్‌లో తిరుపతి ఐఐటి కీలకంగా మారుతుందని వివరించారు.

**ఇంటర్ యూనివర్శిటితో ఒప్పందం:**

ఖగోళశాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్రంలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు పూణేలోని ఐఐట ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) మధ్య శనివారం కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. పూణేలోని ఐయూసీఏఏ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐఐటీ తరపున డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, ఐయూసీఏఏ తరపున డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.ఆనంద్, కోర్ అకడమిక్ ప్రోగ్రామ్స్ డీన్ ప్రొఫెసర్ ఎ.ఎన్. రామప్రకాష్ ఎంఒయూపై సంతకాలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి విజిటర్ అకడమిక్ ప్రోగ్రామ్స్ డీన్ ప్రొఫెసర్ మిశ్రా, ఐయూసీఏఏ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమాండర్ (రిటైర్డ్) వి.కె. విజయ్ బాలాజీ పాల్గొన్నారు.ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి పరిశోధనలు, శాస్త్రీయ సంప్రదింపులు, విద్యాపరమైన మార్పిడి కార్యక్రమాలకు మార్గం సుగమం కానుంది. రెండు సంస్థల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పరస్పరం ఒకరి సంస్థలో మరొకరు పరిశోధనలు చేసుకునే అవకాశం లభించనుంది. భూపత్, జ్యోతి మెహతా ఫ్యామిలీ ఫౌండేషన్ సహకారంతో స్కూల్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఏర్పాటు చేసే దిశగా ఐఐటీ తిరుపతి అడుగులు వేస్తున్న తరుణంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఎంఒయూ నిరంతర శాస్త్రీయ, విద్యాపరమైన సహకారానికి చట్రాన్ని అందిస్తుందని, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు అర్థవంతమైన అవకాశాలు కల్పిస్తూ ఖగోళశాస్త్ర పరిశోధనలను బలోపేతం చేస్తుందని అన్నారు. ఐయూసీఏఏ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్ మాట్లాడుతూ భారత విశ్వవిద్యాలయ వ్యవస్థలో ఖగోళ శాస్త్రాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని, ఐఐటీ తిరుపతితో సహకారం ఉమ్మడి పరిశోధన, శిక్షణకు కొత్త మార్గాలు వేస్తుందని పేర్కొన్నారు.

# జనసేన పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం

## పార్లమెంటు సమీక్షలో శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మెన్

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయటానికి ప్రతి కార్యకర్త ముందుకు రావాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ (జనసేన) కొట్టెసాయి ప్రసాద్ పిలుపు నిచ్చారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన పార్టీ దృష్టికి పలు అంశాలు తెచ్చారు.శ్రీకాళహస్తిలో కూటమి ప్రభుత్వం పరిపాలన సాగుతుందన్నారు. ఈ నేపధ్యంలో శాసనసభ్యుడు తెలుగుదేశం పార్టీకి చెందిన యువకుడు ఉండగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ పగ్గాలను జనసేన పార్టీకి చెందిన కొట్టెసాయి ప్రసాద్‌కు అప్పగించారు.పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన స్థానిక పరిస్థితిని వివరించారు. ముఖ్యంగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని అందుకు సంబంధించి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులకు చేయూత ఇవ్వాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా జనసేన సైనికులు సిద్ధంగా ఉన్నారన్నారు. మండలాల వారిగా పార్టీ కార్యచరణపై సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బల పడాలంటే నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాబోవు పంచాయతీ, ఎంపిపి,జడ్‌పి ఎన్నికల్లో పోటీ చేయటానికి ఉత్సాహ పడుతున్న ఆశావహుల నుంచి పేర్లను తీసుకున్నారు. అయితే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా ప్రజలతో మమేకమై కార్యకర్తలతో సమన్వయంతో పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని పార్టీ నాయకుల దృష్టికి తెచ్చారు.ఇక పోటీ చేయదలచిన వారి అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు.పార్టీ ప్రముఖులు ఎన్నికల్లో పోటీ




చేయదలచిన వారు. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి ఉండి ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ నిర్దేశించిన కార్యాచరణను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించినట్లు కొట్టెసాయి ప్రసాద్ వివరించారు.

## వినాయక చారిటబుల్ ట్రస్ట్‌చే విగ్రహాల పంపిణీ



శ్రీకాళహస్తి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: వినాయకుని పండగ సందర్భంగా ప్రతి ఏడాది సామాజిక కార్యకర్త భక్తి శ్రద్దలతో వినాయ విగ్రహాలను అందిస్తున్నారు.ఈ నేపధ్యంలో శనివారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గల రోటరీ క్లబ్ అధ్వర్యంలో వినాయక ప్రతిమలను అందించారు.వినాయక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. బొజ్జల బృందమ్మ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 30 ఏళ్ల క్రితం కేవలం 5 విగ్రహాలతో ప్రారంభమైన ఈ సేవా యాత్ర నేడు వందలాది విగ్రహాల పంపిణీ స్థాయికి చేరిందని ట్రస్ట్ చైర్మన్, మాజీ నేషనల్ టూరిజం డైరెక్టర్ తిరుమెర్ల సురేంద్ర కుమార్ రెడ్డిని బృందమ్మ అభినందించారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో ఈ పవిత్ర కార్యాన్ని నిర్వహిస్తూ సమాజ హితం కోసం ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. విఘ్నేశ్వరుని పూజ ప్రాశస్త్యాన్ని, వినాయక చవితి తెచ్చే ఆధ్యాత్మిక సమైక్యతను ఆమె వివరిస్తూ ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో సురేంద్రకుమార్‌రెడ్డి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్టీలతో ప్రమేయం లేకుండా నాయకులు హాజరయ్యారు.ఈ కార్యక్రమాల్లో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,జనసేన పార్టీ నాయకులు కిరణ్ రాయల్, దండి రాఘవయ్య, కండ్రిగ ఉమ,శ్రీకాళహస్తి వ్యవసాయామర్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ట్రస్ట్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఓటీపీ విధానం...రద్దు చేయాలి



తొట్టంబేడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమంలో కొత్తగా ఒకసారి సంకేత పద్ధతి రద్దు చేయాలని గ్రామ, పట్టణ సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు డిమాండు చేస్తున్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శనివారం తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండలాల ఆరోగ్య కార్యదర్శులు, సహాయక నర్సుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను గురించి వివరించారు. తమ డిమాండ్లకు సంబంధించిన వినతి పత్రాన్ని వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. నూతన సాంకేతిక విధానాల్లో సంస్కరణల్లో భాగంగా సంకేత పద్ధతి వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన కారులు వాపోయారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తుంటే ప్రజలు తమ ఫోనుకు వచ్చిన సంకేత సంఖ్యను చెప్పేందుకు నిరాకరిస్తున్నారని, అనుమానంతో చూస్తున్నారని తెలిపారు. దీంతో సర్వే పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పని వేళలు అంటూ ఏమీ లేవని, ఒకవైపు వైద్య శాఖ అధికారులు, మరోవైపు సచివాలయ అధికారులు ఆదేశాలు ఇస్తుండడంతో ఏది చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. పింఛను పంపిణీ రోజే టీకాల కార్యక్రమం పెట్టడం వల్ల క్షేత్ర స్థాయిలో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల ఆరోగ్య భద్రత కోసం నిరంతరం పని చేస్తున్న తమపై మరింత భారం మోపడం సరి కాదని, ప్రభుత్వం సంకేత పద్ధతిని రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సుశీల, రమ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ఉత్తర ప్రదేశ్ మంత్రి



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఉత్తరప్రదేశ్ మంత్రి సురేష్ రాహీ కుటుంబ సభుయలతో రాగా దక్షిణ గోపురం వద్ద వారికి ఆలమ మర్యాదలతో ఇఒ బికె వెంకటేశులు, ఎపిఆర్ఒ రవిలు వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహి మాన్విత పూజలను జరిపించుకున్న మంత్రి కుటుంబానికి స్వామి అమ్మవార్ల అ ంతరాలయ దర్శనం కల్పించారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఇఒ అందించారు. ఏర్పాట్లును ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు.

## వెంకటేశ్వరునికి ఊంజల్‌సేవ, గ్రామోత్సవం



వడమాలపేట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శనివారం వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుతీర్చారు. శ్రీనివాసుడు గంట పాటు సిద్విచలాసంగా ఊయలలూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి శ్రీనివాసుడు పురవీధుల్లో విహరించారు. స్థానిక భక్తులు ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, అర్చకులు తిప్పయాచార్యులు, రమణాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల వేళ ఊపందుకున్న మేయర్ పదవిపై చర్చ!

### యువ నాయకత్వంపై ఆసక్తి



తిరుపతి విద్య, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయాలు క్రమంగా వేడెక్కుతున్నాయి. అక్టోబరు నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో ఎన్నికల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మేయర్, చైర్మన్, చైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో తిరుపతి నగర ప్రథమ పౌరుడి పదవిపై రాజకీయ వర్గాల్లో చర్చ మరింత ఊపందుకుంది.తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి సమీకరణాల నేపథ్యంలో తిరుపతి మేయర్ పదవికి ఎవరిని బరిలోకి దించాలనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. నగరంలో పార్టీ బలం, సామాజిక సమీకరణాలు, అభ్యర్థికి ఉన్న ప్రజా పరిచయం, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు నేతల పేర్లు వినిపిస్తుండగా, విద్యావేత్త, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా ఉండే ప్రణీత్ పెనుమాదు పేరు ప్రత్యేకంగా చర్చకు వస్తోంది.

ప్రణీత్ వైపు రాజకీయ వర్గాల దృష్టి ?

ఎడిఫైస్ పాఠశాలల అధినేతగా విద్యారంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ప్రణీత్ పెనుమాదు.. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కూడా నగరంలో పరిచయాన్ని పెంచుకున్నట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి. రాజకీయాల్లో ప్రత్యక్షంగా క్రియాశీలకంగా మారకముందే విద్య, సేవా కార్యక్రమాల్లో కొనసాగడం ఆయన పేరును మేయర్ పదవికి సంబంధించి చర్చలోకి తీసుకువచ్చిన అంశాల్లో ఒకటిగా రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.కొవిడ్ సమయంలో ప్రజలకు సహాయ కార్యక్రమాలు నిర్వహించడం, వరదల సమయంలో బాధితులకు నిత్యావసర సరుకులు, ఆహార పొట్లాలు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వర్గాలు చెబుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి అంబులెన్స్ సేవలు అందిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ సేవా కార్యక్రమాలు ప్రణీత్‌కు నగరంలోని వివిధ వర్గాలతో పరిచయం పెంచాయని ఆయన అనుచరులు చెబుతున్నారు. విద్యారంగంలో ఎడిఫైస్ పాఠశాలలు, శ్రీ పద్మావతి విద్యాసంస్థల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రణీత్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం, అవసరమైన సహకారం అందించడం వంటి కార్యక్రమాలతో ఆయనకు విద్యారంగంలో గుర్తింపు ఏర్పడిందని చెబుతున్నారు.మరోవైపు తిరుపతి నగర రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు కూడా కీలకంగా ఉంటాయి. బలిజ సామాజిక వర్గానికి నగరంలో గణనీయమైన ప్రాతినిధ్యం ఉండటంతో ఆ వర్గానికి చెందిన యువ నాయకత్వానికి అవకాశం కల్పించే అంశం కూడా రాజకీయ చర్చల్లో ఉన్నట్లు సమాచారం. ఈ సమీకరణాల్లో ప్రణీత్ పెనుమాదు పేరు ముందుకు రావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

యువ నాయకత్వానికి అవకాశం దక్కేనా ?

ప్రస్తుత రాజకీయాల్లో యువతకు, విద్యావంతులకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రణీత్ వంటి కొత్త తరానికి చెందిన నాయకులపై పార్టీల దృష్టి ఉండవచ్చనే చర్చ సాగుతోంది. నగర పాలనపై అవగాహన, నిర్వహణ సామర్థ్యం, సేవా కార్యక్రమాల అనుభవం, విద్యారంగంతో ఉన్న అనుబంధం వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా మారవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.అయితే మేయర్ పదవికి అభ్యర్థి ఎంపికలో రిజర్వేషన్లు, ఎన్నికల ఫలితాలు, కార్పొరేషన్‌లో ఏర్పడే బలాబలాలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి.